* కథానిక*

నీలి

శ్రీ పురాణం సుబ్రహ్మణ్యశర్మ

ఒక మహారణ్యం తగులబడిపోతున్నది.

జంతువులు చెల్లాచెదరుగా పరుగులు పెడ్తున్నాయి. బండరాళ్ళు సైతం ఫెటేలు ఫెటేలుమని విచ్చిపోతూ ఎగిరెగిరి పడ్తున్నాయి. చిన్న చిన్న చెట్లు—చిట్టి పొదలు, నిప్పు చుట్టేసుకోగా గాలికి గిర్రున తిరుగుతూ, ఒక చోటునుంచి మరోకచోటుకి పరుగులెత్తినట్లుగా అనిపిస్తోంది.

పొగ పెద్దరాక్షసుడిలా లేచింది.

తప్పించుకు పారిపోలేని పక్షులన్నీ, ఆ పొగలో రెక్కలార్చుకుంటూ—ఎగరగలిగినంతగా పైకిపైకి లేచి, గిలగిలా కొట్టుకుంటున్నాయి. నేలమీది పుట్టల్లోని కలుగుల్లోని రకరకాల పాములు, దొర్లుకుంటూ, ఎగురుతూ, దూకుతూ, మంటల్ని తప్పుకుందుకు పరుగులెడుతున్నాయి. మొదళ్లు కాలిపోగా పెద్ద పెద్ద వృక్షాలు మండుతూ మండుతూ నేల కొరుగుతున్నాయి. భూమి మంటలతో చిటపటలాడుతున్నది. రామచిలుకలు పిచ్చుకల దగ్గర్నుంచి, పావురాలు డేగలు రాబందులవరకూ ఎగరలేక రాలి పడిపోతున్నాయి. కట్టలు కట్టలుగా వెలికివచ్చి పరుగులు పెడ్తున్న పాములు తుట్టలుతుట్టలుగా కాలి రాళ్ళక్రిందకు—లోయల్లోకి పడిపోతున్నాయి.

ఇంతింతలేసి మంటలు!!! రాక్షసి పొగ!! ఈ అందమైన సృష్టియొక్క వినాశమంతా ఎక్కడో నా హృదయంలో జరుగుతున్నట్లే వుంది.

ఆ పొగలు మంటలు రకరకాల ప్రాణుల హాహాకారాల వెనుక, మీదనుంచి కాలిపోతూ రాలిపోయే పక్షుల రెక్కల గిజగిజల వెనుక ఒక మానవకంఠం కొద్దిగా వినవస్తున్నది.

ఈ తగులబడిపోయే ప్రకృతివెనుక ఒక మానవస్వరాన్ని విన్న నా అవస్థ యేమని చెప్పకోను?

గులాబీరంగు లేతపాదాలమీద జీరాడే పాలమీగడ వన్నె కుచ్చెళ్లు—పరిగెత్తుకుంటూ, ఆ మంటలలో భగ్గునమండే తాళ్ళను యెక్కి దూకుతున్నప్పుడు....గప్పున ఆ చిన్న నడుమును రెంతు చేతులా దొరకపుచ్చుగుని ఆమెతో ఆకాశంలోనికి పరువెత్తగలిగితే...వారెవ్వా?

—రాక్షసి పొగ నన్ను చూసి నవ్వింది.

మళ్ళీ ఒక రాబందులతుట్ట కొల్తూరాల్తోంది. ఒక మహావృక్షం మంటల్తో వొరుగుతున్నాది.

అయ్యో!!! అయ్యో! ఆ లేత గులాబీ వన్నె పాదాలు! చెదరి చెదరి వేస్తున్నది అడుగులు. బెదరి బెదరి చూస్తున్నది మంటలు.

తెల్లటి కుచ్చెళ్ల ప్రక్కనుంచి పాములు తుట్టగా దొర్లుకుంటూ పోతున్నాయి. పూల పొట్లాల్లాటి అరచేతులు రెంటితో తామరమొగ్గల్లా, చెమర్చి కందినట్లున్న వక్షఃప్రదేశాల్ని కప్పుకొంటూ ఆ పిల్ల పరుగులెత్తుతున్నది. పాలరాతి శిల్పంలా చేయివేస్తే జారిపోయేట్లున్న ఆ మెడనిండా ముత్యాలు ముత్యాలుగా చెమట పొటమరిస్తోంది. తల అటూ యిటూ త్రిప్పుతున్నది. చెక్కిళ్ళు ఎరుపెక్కాయి. ఆమె కళ్ళకేసి చూశాను. అయ్యో—ఏడుస్తోంది గావల్ను? ఇంక లాభంలేదు. పాపం పరుగెత్తి పరుగెత్తి అలసినట్లుంది. ఏ జాయో త్రేలిపోయి మీదబడి తల్లబద్దలవుతుంది. ఆ పాలమీగడ వన్నె కుచ్చెళ్లు, ఈ రోజారంగుపిల్లయొక్క ఆ అందమైన చిన్న నోరు, పట్టుతివాసీలమీద పరుగెత్తవలసిన పాదాలు, ఇంకా వొణుకుతున్నట్లున్న ఆ పెదవులు అంతా—యిందాకటి చెమర్చి కందినట్లున్న తామరమొగ్గల జంట, సర్వమూ నుగ్గునుగ్గయి బొగ్గు బొగ్గయి కాలిపోవలసిందేనా?

నిలువు నిలువునా నేను దహనమైపోతున్నాను.

ఆ వొణికే పెదాలను పంటితో అణచటానికి యత్నిస్తున్నదినొక్క. కళ్ళవెంబడి వొకొక్క చుక్క రాలి చెంపలమీదుగా పరుగెత్తి టప్పుమని దిగువకు చిందుతున్నాది. పరుగెత్తి అకస్మాత్తుగా నిలచిపోయిన ఆమె కాళ్లు కంపిస్తున్నాయి. ఆ తెల్లటి పావడా బరువుగా క్రిందకు లాగేస్తున్నది.

నేను నెత్తి మొత్తుగుంటున్నాను. జుట్టు పీక్కుంటున్నాను. కళ్ళు పొడుచుగుంటున్నాను.

ఆమె రెండు చేతుల్నీ వూపుగుంటూ నిలబడింది. వెనుక తగులబడిపోయే అరణ్యం తరుముకొస్తున్నది. నా మట్టుకు నేను ఆ మనోహరమూర్తిని ఎత్తుకుని పారిపోగలిగితే......రక్షించుకోలేనా అని వాపోతున్నాను. ఆ పిల్ల అంత ఎత్తునుంచీ నేను చూస్తుండగా వురికింది. వురికి—నా గుండెలమీద వచ్చిపడింది.

నేను నిద్రనుండి మేల్కొన్నాను. కన్న భీభత్సంతో నా మెదల్లోని నరాలన్నీ సడలిచ్చేశాయి. నేను చూసిన సౌందర్యంతో నా హృదయం నిండుగా పూరింది.

రోజా వన్నెపిల్ల నా కళ్ళలో మెసుల్తున్నాది.

* ఈ సంవత్సరం ప్రపంచ కథానికల పోటీకి పంపిన తెనుగు కథ.

గదికి తాళంవేసి క్రిందకుదిగి హోటల్లో బల్లముందు వచ్చి కూర్చున్నాను. దీపాలు మసగమసగ్గా వెలుగుతున్నాయి. నేను కూర్చున్న చోటునుండి చూస్తే ఖణఖణ మండే పెద్దపొయ్యి, దాని ముందుగా ఒక ముసలావిడ అవుపించారు. చుట్టూ గోడలు నల నల్లగా మసిబారివున్నాయి.

చప్పట్లు, గోలగా నవ్వు వినిపించి, భరించలేక తలెత్తి ప్రక్కకు చూశాను. డబ్బుల బల్లదగ్గర కుర్చీలో మిలమిలా మెరుస్తున్నై రెండు కళ్లు. బాగా ఎదిగినా నడుం వంగిపోయింది. పిడతలాంటి తల, అతికినట్లున్న ముక్కు, బాకౌలాటి నోరు, దొప్ప చెవులు. వుండి వుండి లేచి ఒక చేత్తో ముందుకువంగి 'సర్వరు' గుడ్డల్ని పీకుతున్నాడు. బొత్తాములు పెట్టని బాగా వొదులుగా వ్రేలాడే చొక్కా, అలివురంగునిక్కరు—ఆ నిక్కరు జారిపోయి మోకాళ్ళమీదకు వచ్చి నిలబడింది.

కమ్మటి కాఫీని ఆప్యాయంగా చప్పరిస్తూండగా గ్రద్ద ముక్కు, చీకట్లో మెరిసే ఆ అమోఘమయ దృక్కులు, నా వైపు తిరగటంతో సగం కాఫీ అట్టే విడిచి లేచిపోయాను.

పొయ్యిమంట ముఖానకొట్టగా చెంగుతో వొత్తుగుంటూ ముసలమ్మ 'రాత్రి భోజనం గదిలో పెట్టమంటావా? నాయనా—' అంటూ వచ్చింది.

'అక్కర్లేదమ్మా—రాత్రి మరికరాను. నాకు డ్యూటీ...' అనేసి వెళ్లిపోతూండగా వెనుకనుంచి వచ్చాయి మాటలు.

'పెద్దాన్ని. కూర్చునే వో కునుకు తీస్తుంటాను. బద్ధకించేవు నాయనా లేపడానికి...'

'అయ్యో పాపం మంచిమనిషి అనుకుంటూ అడుగులు ముందుకు వేస్తున్నాను. కాని ఆ వెర్రిపిల్లాడు చూపుడు వ్రేలు ఆడిస్తూ నామీద మీద కురుకుతున్నట్లే అనిపించసాగింది.

గుండెలలో నిండుగా దూకి నన్ను మధుర స్రవంతిలో వోలలాడిస్తున్న నా రోజారంగుపిల్ల యింకా అక్కడే వున్నట్లు తోచి అరచేత్తో ఛాతీరాసుగుంటూ తాతిమెట్లు దిగపోతున్నాను. దిగితే యిక సున్నటి సిమెంటురోడ్డే...మనుష్యుల ఆకారాలు వివిధ వాహనాలు అన్నివైపులనుంచీ కదులుతున్నాయి.

నేను ఎక్కిదిగుతున్న రాతిమెట్ల క్రిందుగా మురికి కాలువ నెమ్మదిగా పారుతోంది. కొంచెం సమీపంగానే లాంతరు స్తంభం యొక్క వెల్తురులో ఒక సన్నటినీడ కదుల్తూ యిటువైపే రావటం గమనించాను. చాలా నెమ్మదిగా కదుల్తున్న ఆ నీడతోబాటు టక్కుటక్కు మనే కటువైన శబ్దంకూడా విన్నాను.

ఎవరో కుంటిపిల్ల నావైపే చూస్తూ ఆగింది. వూతకర్రమీద ఆనకపోయినట్లయితే నేను అకస్మాత్తుగా ఎవరో ముష్టిపిల్ల అనే నిర్ణయానికి చప్పున వచ్చివుండకపోదును. చంకలో కూజా పొందికగా యిమిడివుంది. బహుశా నీరు తెస్తూండవచ్చు. నడినెత్తిన కాస్తంత పల్చగా జుట్టు, కోలముఖం, పాపటనుంచి కనుబొమల మధ్యకు ఎంతదూరమో సరిగా యించుమించు అంతేదూరాన చిబుకమూ, లోనికి దిగిపోయిన గుంటకళ్ళు—ఆ చీకట్లో రెండు మిణుగురు పురుగులా అనిపించక మానదు. ఒకకాలు మెలిదిరిగిపోయి వ్రేలాడుతోంది. ఇకముందు యెప్పుడైనా ఆడదానిపట్ల యేవిధమైనటువంటి మమకారంగాని పెట్టుకోదల్చుకున్నట్లయితే యీ మనిషిముఖం ఒక్కమారుకూడా మగవాడు చూడకూడదు.

అసహ్యంతో నిండిన మనస్సుతో జేబులోనుంచి రెండణాల కాసునుతీసి 'ఎందుకట్లా నిలబడి చూస్తావు? ఫో...ఫో...' అని ఆ మెలి దిరిగిపోయిన పాదాలవద్ద పడేట్లు విసిరేసి గబగబా రోడ్డుమీదకు నడవబోయాను.

నా వెనుక పెద్ద చప్పుడయింది.

ఆ అవిటిపిల్ల మెట్లదగ్గర కూజాను ఎత్తేసింది. ఆనీళ్లు, మన్ను అంతా చింది నా బట్టలమీదకూడా వెనుక కొంత పడ్డాయి. నేను విసిరేసిన బేడ కాసు మాత్రం నేలమీద నీళ్ళమధ్య బురదలో మెరుస్తోంది. అందులోనే ఆ అవిటిపిల్ల చంకనుండి రాలిన ఊత కర్రకూడా పొర్లాడుతోంది.

'నే నేమీ ముష్టిపిల్లనుకానండీ...' అన్న గొంతు వినిపించి నన్ను కమిచితో బాదినట్లు కాగా అదేపనిగా పరుగెత్తినట్లు నడిచాను. వీధి మలుపు తిరిగి మరోలాంతరు స్తంభంవరకూ వచ్చాక గుండె తడిమి చూసుగున్నాను. రోజారంగుపిల్ల—లేదు. శూన్యతే మిగిలింది.

ఎంత ప్రయత్నించినా మీదమీదకు వస్తూ చూపుడు వ్రేలాడించే వెర్రిపిల్లాడూ, మెలిదిరిగిపోయిన కాలుతో వూతకర్ర టక్కుటక్కు మనిపిస్తూ నా హృదయంలోనుంచి రోజారంగు పిల్లను తరిమేసిన ఆ కుంటిపిల్ల—వీళ్ళే మిగిలారు.

లేత గులాబీవన్నె పాదాలు పాలమీగడరంగు కుచ్చిళ్లు, వొణికే పెదాలు చిన్ననోరు పిట్టలాటి నడుమూ అన్నీ మాయమయినై. వీటిస్థానే నడినెత్తినుంచి పాపట, కోలముఖమూ, మిణుగురు పురుగుల్లాటి కళ్ళు పదేపదే జ్ఞాపకానికి రాసాగాయి. మనస్సులో యేడ్చినంతసేపు యేడ్చాను అంతుచిక్కని రోజారంగు పిల్లకోసం. నాకు చేతయినన్ని రకాలుగా తిట్టుగున్నాను ఆ రెండు ముఖాల్ని.

చివరికి రెంటిని నిత్యమూ చూడ్డంనుంచి తప్పుకోవటం కోసమైనా ఆ హోటల్నుంచి మకాం ఎత్తటం వరకూ ఖుద్రపాడు చేసుగుని ఆలోచించాను. ఆరాత్రి రాత్రల్లా నిజంగా ఒక మహారణ్యం తగలబడిపోతున్నట్లే వుంది నా మెదడులో!

ఏమైనా పదిగంటలవరకూ లేవకూడదనే తలపుతో ముసుగు తన్ని పరున్న నేను యెవరో తలుపుమీద దబదబా బాదటంతో విసుక్కుంటూ లేచాను. 'గది తుడవమంటారా?' అంటూ వచ్చిన హోటలు కుర్రాణ్ని 'ఛీ పొమ్మ'ని గసిరేశాను. ఆ వుదయం వరండాలో పచార్లు చేస్తుండగా ముసలమ్మగారు వచ్చింది. ఆవిడకు కొంచెం కోపం వచ్చివుండాలి రాత్రి భోజనానికి రానందుకు.

'కూజాలో నీళ్లు పట్టమని గది శుభ్రం చెయ్యమని కుర్రాణ్ని పంపిస్తే కొట్టవచ్చావుటగా నాయనా' నేనే తీసుకుపోదామని వచ్చాను. నీకు ఎల్లాటిపిల్లలు పుట్టుగొస్తారనీ...యింకా బలమైన ఆహారంతింటే—!

నేను చప్పున సిగ్గుపడి బోయానల్లే వుంది.

విశృంఖలంగా హోటళ్ళకు అంకితమయే నా జీవితం జ్ఞప్తికొచ్చి నవ్వొస్తున్నాను. బహు బద్ధకస్తుడిగా జీవించటంలో నాకు నేనే తీరని అన్యాయం చేసుకుంటున్నానేమో అనిపిస్తోంది. ఇక యీ వయస్సులో యేర్పడ్డ అలవాట్లు జీవితం పొడుగునా మారవు. ఇల్లు కాపురం, పెళ్ళాంపేరు చెప్పుకొని యెప్పుడో తొంగిచూడబోయే వొక క్రొత్త అమ్మాయి - యీ వూహాలు ఎంతో దూరాన వర్షించని మేఘాల్లా పరుగులు పెడ్తూంటే, నిన్న సాయంత్రంవరకూ కనిపించిన రోజారంగుపిల్ల తలపులు తిరిగి నాలో చిందులు త్రొక్కసాగాయి.

వయస్సులో అమ్మాయిలు చాలామంది బావుంటారనే అభిప్రాయం నాకుంది. అందుచేత పెట్టెబండ్లలో స్కూళ్ళకు పోయే అమ్మాయిలు, సాయంత్రం బీచిలో వరసాగ్గా కూర్చొని యిసుకలో కేరింతాలుకొట్టే ఆసుపత్రి నర్సులు, సినిమాహాల్లోని జంటలను విడదీస్తే వచ్చే ఆడముఖాలు యిన్ని చూస్తూంటే యిన్ని సంవత్సరాలుగాను వీట్లలోని యేముఖాన్ని గాని నాకుగాను కావాలని అనుకోలేదు. కాని వానలో యెండలో గొడుగులు పుచ్చుకొని చేతిలో చిన్నసంచీ అరికాళ్ళకు తొడిగిన చతకరకం చెప్పులతో స్కూళ్ళకు పరుగెత్తే మిస్సమ్మల్ని చూసి నప్పుడల్లా జాలిపడేవాణ్ని. డబ్బు పాడుచేసుకుని జీవితాన్ని లక్ష్యంచెయ్యక బహు బద్ధకస్తుడిగా నేను గడించిన దాన్లో కల్లా యీ అనుభవాన్నే పదిలంగా జీవితాంతంవరకూ గుర్తుపెట్టుకోవలసి వుంటుంది.

తువ్వాలు బుజాన్నేసుకుని హోటలు నుయ్యి ప్రక్కకు చేరాను. బాగా ప్రొద్దెక్కడం చేత అప్పుడే చాలామంది అక్కడ పోగయ్యారు. మాట్లాడేవాళ్ళు మాట్లాడుతున్నారు. ఎండ పొడుచుకొస్తోంది. ఒక ప్రక్కనుంచి నీరు తోడుకొని స్నానం చేస్తున్న నాకు నూతిగట్టుకు ఆన్చిన కుంటివాళ్ళ చంకను బెట్టుకునే వూతకర్ర హఠాత్తుగా అగుపించింది. ఆ ప్రక్కనే ఎర్రటి కెంపురంగు పరికిణీ పువ్వుల పువ్వుల వోణీపిల్ల కూర్చుని చాలా కూజాలను ముందేసుకుని ఒక్కటొక్కటే శుభ్రంచేస్తున్నది. అట్లా తోలిచిన కూజాల్లోకి ఒక కుర్రాడు నీళ్లుతోడి నింపుతున్నాడు. ఆ ముఖం చూడవలసి వస్తుందేమోనని ఆతృతగా రావటంలో వాళ్ళు కూడా సరిగా రుద్దుకోలేదు. బహుశా నా కూజాకూడా అందులో వుండ వచ్చుగదా అని తోచింది. గుర్తుకోసం నా కూజామీద చాకుతో 'S' అని చెక్కాను కూడా.

మరోగంట గడిచాక కాబోలు వసారాలో 'టక్కు టక్కు' మనే కర్కశమైన ధ్వని వినవచ్చింది. ఆ కుంటిపిల్ల యీ హోటల్లోనే పనిచేస్తూండాలి: పొట్టకోసం కష్టపడ్డానికి మగవారిలా ఆడవాళ్ళు పనికిరారనే అభిప్రాయం నాకుంది.

కుర్రాడు నా కూజా తెచ్చి కిటికీలో వుంచుతుండగా 'ఆ టక్కుమనే దేవిటని అడిగాను.

'అదా—నీలి బాబూ నీలి, గది వూడుసుతుందాది'

'ఆహా' అని తలవూచాను.

'వోరి వూసే అక్కర్నేదు బాబూ! ఆయమ్మి గొడవేటో... పనేటో...' అనేసి కొంచెంగాను నవ్వి వెళ్ళిపోయాడు.

ఆ కెంపురంగు పావడా టక్కుటక్కుమనే ఆ కర్రతో నా గదిలోకి రాకుండావుంటే చాలు అనుకుని లేచి వెళ్ళి తలుపు గెడేసొచ్చాను.

గది యింకా సర్దలేదు. ఎక్కడ వస్తువులు అక్కడ చెల్లా చెదరుగా పడివున్నాయి. క్యాంపుకాటుమీద పరిచిన హోల్డాలు బెల్టులు నిన్నటి కలలోని కాలిపోయి దొర్లుకుపోతున్న పాముల్లా వ్రేలాడుతున్నాయి. నా పెట్టెమీద పారేసిన దుస్తుల జతలు, కొంకిన వ్రేలాడుతున్న పంట్లాములు గ్రద్దలూ—రాబందుల్లానూ, గదికుమ్మంవద్ద పేర్చిన బూడ్సులు బండవాళ్ళలానూ కనిపించాయి.

తలుపు కాస్త కిర్రుమంది. టక్కు టక్కు మనే చప్పుడు చెవి దగ్గరలోకి వచ్చి ఆగినట్లే వుంది. దాని వెంబడిని తలుపురెక్కమీద ఎవరో నీరసంగా చేయి ఆన్చినట్లుకూడా వేసింది నాకు అనుమానం.

'బాబుగారూ!' అన్న పిలుపు—

తగులబడిపోతున్న ఒక మహావృక్షం నెమ్మదిగా నామీదకు వొరుగుతున్నట్టే ఫీలయ్యాను. నా గుండెలమీద కురికి నిలచిన ఆ ఒక్క మధురస్మృతి కూడా నాకు దక్కదేమోనన్న భయం లోపల విపరీతంగా వేధిస్తోంది. అయిష్టంతోటే, బలవంతాన ఎవరో త్రోసినట్లుగా వెళ్ళి తలుపు గెడ తీశాను. ఏం చెప్పను!

నా గది గడపవద్ద ఎర్రపావడా పూలవోణీ 'నీలి' కుప్పలా చతికిలబడివుంది. డొక్కలో కాళ్లు తన్ని పెట్టుకుని తోకను కొరుక్కుంటూ హోటళ్లలో, బల్లక్రింద పడుకునే దిక్కుమాలిన కుక్క జ్ఞాపక మొస్తోంది.

నీలి తన మెలితిరిగిన కాలు మడతవేసి ఆ వూతకర్రను నేలమీద ఒక చేత్తో త్రోసుకుంటూ రెండవ చేత్తో వూడుస్తున్నది. ఆమె ఆవిధంగా జేకుతున్నప్పుడు తన కాలు కాళ్లను దాటి పరికిణీ వెనక్కు పోకుండా మధ్యను ఆగి కప్పుకొంటున్నది. చూస్తే మనిషిలో ఎముకలూ ఆ బొమికెలను కప్పేందుకుగాను చర్మమూ తప్ప మరేవిధమైన నటువంటి మృదువైన మెత్తపల్లాలు కనీసం మచ్చుకైనా దొరకని ఆమె 'మానం' వల్ల అంత అభిమానం కనపర్చటం నిజంగా నాకు ఆశ్చర్యాన్నే కలిగించింది.

తలలో వున్న ఆ పది పేరకల జుత్తులోనూ ఒక ఎర్రగన్నేరు పువ్వు తురిమింది. ఆకాలు యీడ్చుకుంటూ వసారా అంతా తాబేలులా తుడుచుకొస్తున్నది. మెడమీదనుంచి కారుతున్న చెమటను పవిటచెరుగుతో వొత్తుకుని, లోతుకు దించుకునిపోయిన కళ్లతో ముఖమెత్తి

'గది వూడుస్తాను బాబూ!' అంది.

చాలా లేతముఖమే—పద్నాలుగు పదిహేనేళ్ళకు మించి వుండకపోవచ్చు.

ఆ అవకరపు మనిషి ముఖం నా మనస్సంతా కలచివేస్తున్నది. నా ఎదురుగా కుప్పలా చతికిలబడింది, నేను పిలుస్తున్నగాలే తనూ పిలుస్తున్నది. ఇక నాకు సంబంధించిన ప్రతివస్తువూ ముట్టుగుని నా దైనిక జీవితంలోనికి అనవసరంగా తొంగి తొంగి చూస్తూ నన్ను మానసిక వ్యథపాలు చేసేలాగుంది. నాకు కోపంలా వచ్చి అనేశాను—'టట్! వీల్లేదు. ఆ చీపు రిల్లాగియ్యి. యిస్తే నేనే తుడుచుకుంటాను రోజూ...'

కసిరినందుకు అభిమానంతో తలకాయ వ్రేలేసుకుని డేకుతూ నీలి మెట్లవైపు కదలటం చూశాను. ఈ రోకలిబండలా ప్రాకే ఎముకల కుప్పను రెండు చేతులా యెత్తి మళ్ళీ యీ చాయలకు రాకుండా విసిరెయ్యగలిగితే—అసహ్యంతో నిండిపోయిన నా మనస్సు ఎంత త్వరలో యిక్కడ్నుంచి బైటపడి మరో హోటలు చూసుకోగలిగితే అంత మంచిదిలా తోచింది. చెప్పానుగా—బహుబద్ధకస్తుడ్ని...ఐతే ప్రపంచంలోని వికారమైన మనుష్యులతో జట్టీలు పెట్టుకుందుకు గాదు నేను—అందమైన వాళ్ళకే యీ భూమిమీద జీవించటానికి హక్కు వున్నట్లుగా చెప్పాలనీ నాకు లేదు. కాని ఒక చిత్రమైన స్థితిలో నన్నేదో మనోవ్యథల్లో ముంచే యీ ముఖాలనుండి తప్పుకుని బ్రతకాలనే యోచనే బహుశా నా మానుషప్రవృత్తిని అణగద్రొక్కేస్తూ వచ్చి వుండవచ్చు.

ఉంటే డ్యూటీ చూసుగోవటం, లేకపోతే వూరంతా చాంద్రాయణం చేసేవాణ్ని. గదితాళాలు కూడా హోటలు కుర్రాడి ముఖాన పారేశాను. ఎప్పుడన్నా తోస్తే రెండు మెతుకులు కొరికేవాణ్ని. లేని రోజున ఆ పళ్లెం అట్లానే నవుకరు కుర్రాడు పట్టుగెళ్ళిపోయేవాడు. క్లబ్బులో చీట్లాట.....రోజూ జేబు ఖాళీకావటం—దాన్తో చిరాకుగా కోపంగా వుండాల్సి వచ్చేది. ఆరోగ్యమంటే యింత లక్ష్యం లేకుండా యెందుకు ప్రవర్తించానో నాకే అర్థంకాలేదు. చాలారోజులకి మళ్ళీ అద్దంముందు కూర్చున్నాను. బుర్ర కుతకుతా వుడికిపోతున్నట్లుంది. తలనిండా దుమ్ము...కళ్లుకూడా గుంటలుపడి లోతుకు దించుకుపోయాయి. గడ్డం తడుముకునేసరికి టెంకాయచిప్పకుమల్లే గరుకుగా తగిలింది.

ఇన్నాళ్లకు ఆరోజు నాకు శెలవు. ఎక్కడకూ వెళ్ళటానికి వంట్లో నాకు శక్తిలేదు. సిగరెట్లు తెగకాలుస్తున్నానేమో ఖుళ్లు ఖుళ్ళుమని దగ్గుకూడా వస్తోంది. ఈ దగ్గు ఒకప్రక్కనుంచి ప్రాణాలు తోడేస్తూంటే ఆ రాత్రి భయంకరంగా గడిపాను.

కడుపులో యేమీ యిమడ్డంలేదు. రెండుమార్లు తిన్నదీ త్రాగినదీ అంతా నిద్రలో కక్కుకున్నాను. నోరంతా అసహ్యంగా మారింది. బట్టలు కుళ్ళువాసన గొడ్తున్నాయి. గొడ్డళ్ళతో బాదినట్లు తలనొప్పి—వో రాత్రివేళకు జ్వరం చర్రున త్రాచుపాములా లేచింది. రోగానికి లొంగిపోయి బిగ్గరగా యేడ్చేశాను. మళ్ళీ నాకు తెలివివచ్చేసరికి చూస్తే భళ్లున తెల్లవారింది. నాపక్కను ముసలమ్మగారు కూర్చుంది.

'భయంలేదు నాయనా!' ఆవిడ నామీద చేత్తో నిమురుతూంటే, నేను రెండుచేతులా ముఖం కప్పేసుకున్నాను. మళ్ళీ ఆవిడే అందుకున్నది—'చెప్పేవాళ్లు లేకగాని నీవంటి పిల్లవాడ్ని అదుపాజ్ఞల్లో పెట్టుగోదూ?—యింత విచ్చలవిడిగా యిష్టమొచ్చినట్లు ఆరోగ్యం పాడుచేసుకోనిస్తుందీ? చేసుకున్న పెళ్ళామే ఐతే...'

వ్రేళ్లసందుల్నుంచి చూస్తున్నాను. నేను కక్కిపోసిన స్థలమంతా బూడిదచల్లి వోపిగ్గా కడిగి యెత్తిపోస్తున్న ఎర్రపావడా నీలి ప్రత్యక్షమయింది. వెంటనే తలెత్తి—'ఆ చీపు రక్కడ పారెయ్. నీకు ఎన్నిసార్లని చెప్పాను నా గదిలో కాలుపెట్టవద్దని ...పోతావా పోవా ముందు. ఫో...'

తను నామాటల్ని విననట్టే, తలకాయ వాల్చుగుని నీలి తన పని తాను చేసుకుపోతున్నది.

'ఛీ! ఆ మొండితనం చూడండి.'

ముసలమ్మగారు నవ్వి 'అదే రాత్రి మెల్లగా కుంటుకుంటూ వచ్చి నన్ను లేపింది. ఆ క్రొత్తగా వచ్చిన బాబుకి వంట్లో బాగు లేనట్లుంది. వెళ్లి చూడమ్మా అని.

నేను వెలవెలబోతూ అడిగాను. 'నీలి మీ అమ్మాయా?' అని. నాకు తల గిర్రున తిరిగినట్లయింది.

'అవున్నాయనా, ప్రపంచంలో యిన్నిరకాల ముఖాలవాళ్లున్నారుగదా - మా నీలిని చూస్తే యెందుకు నాయనా నీకంత కోపం?'

ఇల్లా అమాంతం నా మంచం యెగిరి మరో ముక్కూ మొగం తెలియనిచోటికెళ్ళి పడకూడదా అనిపించింది. ఆవిడ అనవసరంగా నేమైనా ఒకమారు చెరగుతో కళ్లు వొత్తుగుని మరీ చెప్పింది - 'నా దరిద్రం కాలిపోను? డబ్బవుతుందిటకాని కాలుమాత్రం మళ్ళీ వస్తుంది. కోసి సరిచేస్తామన్నారు డాక్టర్లు'

నాకు లోలోపల 'ఆ సహాయం మీకు నేను చేయిస్తాను' మీ నీలికి కాలు తెప్పిస్తాను' అని అనాలనుంది. కాని నోరు పెగల్చలేకపోయాను. మళ్ళీ నన్ను నేను తిట్టుగున్నాను. ఏ నిన్నో మొన్నో యీ హోటలునుంచి మకాం యెత్తేసినా బాగుండిపోయేది. కురూపినై ముఖాన్ని లోకానికి చూపించవచ్చుగానీ కృతఘ్నుడై చూపడానికి యిష్టంలేక దుప్పటీ తలంటా లాక్కున్నాను. జ్వరంకన్నా అభిమానం యెక్కువై ఆరోజల్లా మంచం దిగలేదు. రాత్రి పదిగంటలవేళ ఒక అఘాయిత్యం తలబెట్టాను. అంతవరకూ లేని ధైర్యం చొరవ అప్పుడు నా కెక్కడ్నుంచి వచ్చిందో లేచి మెట్లుదిగి బయటవీధిలో కొచ్చేశాను. నాలుగు రిక్షాలను చెప్పి వాళ్లను వచ్చి హోటలు బయట నిలబడమన్నాను. తరువాత గొడవచేయకుండా వొకరివెంటొకర్ని నెమ్మదిగా మెట్లెక్కి మేడమీదకు రమ్మన్నాను. లోపల నాకు నీరసంగానే వుంది. గదిలో సామానంతా వాళ్లచేత సర్దించి చడీ చప్పుడు లేకుండా ఖాళీ చెయ్యాలనీ, మిగతా లావాదేవీలు బయటనుంచి సర్దచ్చు అనీ అనుకున్నాను. ప్లాను అద్భుతంగా మట్టుకు వుంది. కాని ఆచరణలో అది కాస్తా బట్టబయలై నవ్వులపాలయ్యాను.

అంతవరకూ నా గదిదగ్గర కాపలాకు మనిషి పడుకున్నారనే నాకు తెలియదు. రిక్షావాళ్లు పైకి వచ్చారు. గదిలో సామానులు సర్దిస్తున్నాను.

'ఏవిటి చేస్తున్నారు మీరు?' అంటూ తలుపు త్రోసుకుని కుంటికాలుతో ప్రత్యక్షమయింది నీలి. నాకు ఉక్రోషం వచ్చిన మాటా నిజమే—పళ్లు పటపటా పిండుకున్నాను. నన్నిలా అటకాయించే ధైర్యమా?—ఎట్లా వచ్చింది? నీలి వికారంగా నవ్వుతో అంది—

'ఇంతకీ నాకు మెలకువొచ్చింది గనుక సరిపోయింది. ఈయన్ని యెక్కడకు చేరేద్దామని వచ్చార్రా మీరు నలుగురూ? జబ్బు మనిషని ముఖం చూస్తే తెలవటంలే...పోండి. పోండి. నిన్న రాత్రల్లా ఆయన వొళ్లే ఆయనకు తెలీదు.'

ఆ రిక్షావాళ్లు నలుగురూ కొరకొరా నాకేసి చూశారు. అందులో వొకడు 'వోరి పిచ్చోడు గావల్నురా యీన—మాకు తెల్దు తల్లీ! ఈ బాబు మాటల్ను నమ్మి గాడీలో నాక్కల్లినాము గాం. ప్రొద్దుళ్నే పోలీసోరు మక్కెలిరగ దన్నేసేవోరు. పదండ్రా మా గొప్ప చేరవే...'

తిరిగి వాళ్ళు నాకు చెప్పుకునే అవకాశంకూడా లేకుండా జారుకున్నారు. నేను నిలువు నిలువునా కోపంతో దహించిపోతున్నాను. పిచ్చివాణ్ణా నేను? ఎదురుగ్గా అసహ్యమైన ముఖమేసుకొని భయంకూడా లేకుండా నవ్వుతోంది. చెంపలు తకుముకుం లేగరుగ్గా లోతుగా తగిలాయి. వెళ్లి అద్దం చేతిలోకి తీసుకుని దీపం వద్ద వంగి ముఖం చూసుకుంటున్నాను. నల్లగా మసక మసగ్గా అలుముకొనిపోయివుంది.

చెరకుతో నవ్వు నాపుకుంటూ నీలి 'తప్పు. మీరు అద్దంలో ముఖం చూసుగోకూడదు' అంది.

నేనున్న పరిస్థితిలో నామీద అధికారం కూడా చెలాయించేలాగుంది - వారెవ్వా!

'ఇల్లారా...పోనీ నీ ముఖం చూసుకో దీంట్లో...' అని అద్దం ఆమె కెదురుగ్గా త్రోసి వెక్కిరించాను.

'నే నెప్పుడూ అద్దంలో నా ముఖం ఎట్లావుంటుంది అని చూసుగోను. నన్నెవరైనా క్రొత్తగా చూసినప్పుడు వాళ్ల ముఖమే నేనెల్లాగున్నానో అద్దంకన్నా స్పష్టంగా చెబుతుంది' అని వెళ్ళిపోబోతూ—

'మరి మీరు వె...ళ్లి...మళ్లీ...బ...ళ్లి...వా...ళ్లి...ను...' వాక్యం మధ్యలో నే నవ్వువచ్చి తలకాయ పక్కకు త్రిప్పుకొంది. వెళ్లి రెండుచేతులా ఆ యెముకలప్రోగును గుంజిగుంజి నీకు మరీ ఖులాసా గొంక్కవైనట్టుందేమని అడగాలనిపించింది. నాకు వెంటనే జ్ఞాపకమొచ్చింది—సృష్టికర్త, ప్రకృతికూడా వికలాంగులకు అతి తెలివితేటల్నిచ్చి బ్రతకమంటారని.

మళ్లీ కాకులు కూయకుండానే నా గదిలోకి సిద్ధమై 'లేస్తూనే నా ముఖాన్ని మీకు చూపించకూడదనుకున్నాను. కాని....'అంటూ దబ్బున నేలమీద చతికిలపడి నిన్న రాత్రి చిందరవందరగా గదినిండా పరిచిన సామాన్ను ఎక్కడిదక్కడ సర్దేస్తూ 'రాత్రి మీరు గొడవ చేసినట్లు నే నెవ్వరికీ చెప్పలేదు. మా అమ్మకు కూడా...' అని తాను నాకు గొప్ప ఉపకారం చేసినట్లు 'చెప్పనులెండి.' అంది నావైపు చూస్తూ.

నిజంగా ముసలమ్మగారికి తెలిస్తే గోలవుతుంది. ఆ విషయం నాకు స్ఫురించనేలేదు. నీలికేసి గుచ్చిగుచ్చి చూస్తూ పడున్నాను. ఆ కాలు వాళ్ళ అమ్మ ఆశించినట్లుగా బాగుచెయ్యగలరేమో డాక్టర్లు అని నాకూ అనిపించింది. పాపం నీకు ఆ కెంపురంగు పరికిణీ వొక్కటేనా అని అడుగుదామనుకున్నాను. మంచి చీరలు కొనిపెడ్తే......ఆ బొవికల ప్రోగును మార్చడం ఎట్లా...ఒక ఆరు నెలలు పండ్లు పాలూ వెన్నా పెట్టి పెంచితే, అప్పుడు మరీ లావెక్కి యింతకన్నా అసహ్యంగా వుంటుందేమో? కొస్త వంటికి కండ పట్టాక ఫరవాలేదు. చూడ్డానికి నీలి తమాషాగా వుంటుంది. మరి ఆ మిణుగురుపురుగుల్లాటి కళ్ళు—వాటికి బంగారు ఫ్రేము కళ్లద్దాలు తొడిగితే ముఖాన్ని కొంతవరకు కప్పుతుంది. కొద్దిగా లిప్‌స్టిక్కు వాడాక పెదాలు దొండపళ్లే అనిపిస్తాయి. తరువాత వో చిన్న పెట్టె బండీలో కూర్చోబెట్టి కాన్వెంటుస్కూలుకు పంపితే...చాలామట్టుకు మంచి అమ్మాయల్లే నే అవుతుంది.

ఆ వుదయం నేను రైల్వే డాక్టరుదగ్గరకు వెళ్లి 'సిక్ రిపోర్టు' చెయ్యాలి. బిక్కమొగం వేసుకుని గుమ్మంలోని రిక్షాకేసే చూస్తూ ముఖానికి చేయి అడ్డం పెట్టుకొని ఎండలో నిలబడ్డది 'నీలి'—

'ఛా...నే నెక్కడికీ పారిపోను. వొట్టు! ఇం కెక్కడి కెళ్తాను......మరి నా కెవ్వరూ లేరు' అని నవ్వుతూ రిక్షా యెక్కాను.

నేను తిరిగి ఆసుపత్రినుంచి లోనికి అడుగు పెట్టేసరికి హోటలుక్రింద యేదో కొద్దిగా రభస......పై పెదవిని దుబ్బులా క్రమ్ముకొచ్చిన మీసాలను కొరుకుతూ హోటలు యజమాని మల్లయ్య 'అబ్బ! నివ్వుండవే......' అంటూ గసిరాడు భార్యను. ఆవిడ ముఖంలో తుపాను వెలిసే సూచన లెక్కడా కనిపించటం లేదు.

నేను చదీచప్పుడు గాకుండా మేడమెట్లు ఎక్కుతున్నాను.

'కన్నకడుపు యివ్వాళ నాకెంత మండిపోతున్నది? ఏమి తన కూతురేనా అప్సరస? తెలివితక్కువతనానికి పిల్లను నాలుగు కూకలెయ్యాల్సినది పోయి తనూ వెర్రిపిల్లాడని అంటుందా? ఆ ముక్క అభిమానంగల నోట్లోంచి రావలసిందేనా? తెమ్మనండి. యీవిడగారు యే కలకటేరో దిగివచ్చి పెళ్లాడుతా డనుకుంటోంది. కడుపులో యింతలేసి కుళ్ళు ఆలోచనలున్నాయని...'

పైన వేసారాలో దొప్పల్లాటి చెవులు గ్రద్ద ముక్కు బాకాలాటి నోరు క్రిందకు వ్రేలాడిపోతున్న లాగుతో ప్రత్యక్షమయాడు వెర్రిపిల్లాడు. నన్ను చూసి కాలెగరేస్తూ మీదమీద కురకబోతుండగా—సర్వరు

'ఇదుగో నీలి మొగుడు బాబూ—' అని లాగి పట్టుకుని 'చెప్పవయ్యా. ఏది? పెళ్లాం వచ్చాక యేం చేస్తావ్?' అన్నాడు.

సరిగా అప్పుడే నీలి తాళంచెవులు యివ్వటంకోసం టక్కు టక్కుమని చప్పుడు చేసుకుంటూ వస్తున్నది పైకి.

వెర్రిపిల్లాడు గెంతుతూ 'ఇహ్హిహీ!!!' అని తప్పట్లు తరుస్తూ నవ్వుతున్నాడు.

సర్వరు 'నీలి పేరు చెబితే మురిసిపోతున్నాడు బాబూ— యిక యెంతోకాలం ఆగేట్టుకూడా లేదు.' అన్నాక నీలి ముఖం లోకి చూశాను. ఎందుకో సుముఖంగా లేదు. అన్నట్లు ఆరోజు వెలిసిపోయిన చిన్న చిన్న పువ్వులచీర కట్టుగుని తాటాకుబొమ్మలా ముస్తాబయింది. తలలో ఎప్పటి ఆ చిన్న ఎర్రగన్నేరు పువ్వే...

'వచ్చినాడా—' అంది సర్వరును.

వాడు ఆపిల్లాడ్ని నీలమ్మమీదకు వుసిగొల్పి వదిలాడు. వచ్చి వాడు వంగి, చేతిని రెండు మార్లు అర్ధచంద్రాకారంగా వూపుతూ నీలి కొంగు దొరకపుచ్చుకుని లాగాడు. సాచిన చేతిని కసుక్కుమని గిల్లటం నేను చూశాను. ఆ సాహసుడు వెంటనే మీదబడి రెండు చేతుల్తో చుట్టివేయాలనుకున్నాడు యీ అబలను. నీలి ముఖం కంగారుతో నిండిపోయివుంది. సర్వరు వికవికా ఫకాలుమని నవ్వుతున్నాడు. అంతే—విస్సురుగా చంకలోని కర్ర తీసి కాలి మీద వేసింది. 'అమ్మో' అని యేడుస్తూ వాడు కాలు చేత్తో బుచ్చుగుని క్రిందకు దిగిపోయాడు. చూస్తూండగా చేతిలోని కర్రను విసిరేసి గోడమూలను దబ్బున కూలబడిపోయి చేతుల్తో ముఖం కప్పుకొని యేడువసాగింది. ఇంకా నేను వూరడిద్దా మనుకునే లోపునే గాలివానలా వచ్చిపడింది మల్లయ్య భార్య.

'యేడుస్తున్నావటే పైగా, చెట్టంత కుర్రాడ్ని మా కాలి ముడుసు విరిగేట్లు కొట్టి. నీ చేతులు విరగ...సిగ్గులేని ముఖమా! మేనమామ కొడుకన్న గౌరవం యేమన్నా వుందీ? నా కొడుకు కాస్త అమాయకుడు గనుక కర్ర తిరగేస్తావు అవునా?'

'అది కాదత్తా......నా చెయ్యిపుచ్చుకు లాగాడు.' నీలి గొణుగుతోంది.

ఆవిడ బుగ్గలు నొక్కుకుంటూ 'ఐతే......అందుకు తగట్టే వాడు. నీవేమో రంభ ననుకొని కలుకుతున్నావులే—'

'నలుగురి యెదటా మీదబడి అల్లరిచేస్తే నాకు అభిమానంగా వుంటుం దత్తా.' పరుషంగానే అంది చెరగు ముఖానికి కప్పుకొని కళ్ళు రుద్దుకుంటూ—

'ఐతే నా కొడుకుని నలుగురి యెదుటా కర్రపుచ్చుగువాయించావు, నాకెంత అభిమాన ముండాలి? చెప్పుడు మాటలు వింటే బుద్ధు లిట్లాగే వంకరత్రోవలు పడ్తాయి. మిమ్మల్ని కడుపు కట్టుకొని యింతవరకూ యీడ్చుకొచ్చాక యేకు మేకవుతారని కలగన్నామా?' అని ఆమె చేతు లూపుకుంటూ నిష్క్రమించింది.

ఇలా రమ్మని పిలిచాను. నీలి నెమ్మదిగా ప్రాకుకుంటూ వచ్చి గదిమధ్య భాసింపట్టు వేసుగు కూర్చున్నది. పాపం! చాలా బాగా యేడ్చినదల్లే వుంది ముఖమంతా చారికలు కట్టివుంది.

నవ్వుతూ అన్నా 'పెళ్ళి చేసుకోమన్నారనేనా...అంత దుఃఖమూనూ పోనీ—నాకుమల్లే వుండిపోతావా యేఁ?'

'కాదండీ...చూశారా యెంతలేసి మాటలన్నదో మా అత్త. మీరు చూస్తూనే వున్నారుగా. మేవేం ఇక్కడ వీళ్ళ నెత్తిమీద కూర్చొని వూరికే తింటున్నామా? మా అమ్మ నేనూ ఆ స్తమానూ గాడిపొయ్యిదగ్గర, దాసీదానిలా వుదయా స్తమానమూ కూరలు తరిగి, గదులన్నీ వూడిచీ, కూజాల్లోకి నీళ్ళు నింపి చచ్చేచాకిరీ చేస్తూంటామే? ఎంత అనాకారిగా పుట్టినా నాకూ రెండు చేతులంటూ యిచ్చాడుగా భగవంతుడు—'

రెండు నిముషాలు నిశ్శబ్దంగా దొర్లినమీదట, చీర చెరగు నుంచి దారప్పోగులు వెలికి లాకుతూ—'నాకు చదువు నేర్పుతారూ?' తలకాయ వాల్చి నున్నటి గచ్చుమీద చేత్తో వ్రాస్తూ అంది.

'ఏవిటీ? చదువా...' అని ఆశ్చర్యంతో నేను రెట్టించాను.

కాస్తంత సిగ్గుతో 'నాకు అక్షరాలుకూడా రావండి. చిన్నప్పుడు బళ్లోకి పంపమంటే, కొట్టినంత పనిచేసి మొగపిల్లాడు వాడికే లేనప్పుడు దీని కెందుకు చదువు? వూళ్లేలాలా వుద్యోగాలు చెయ్యాలా అంటూ చాకిరీలోకి దింపేసింది మా అత్తే!'

నా యెదురుగ్గా కూర్చున్న తాటాకుబొమ్మ—అందంగా వుండాలనీ, మంచి నగలూ చీరెలూ కోరుతుందనీ, అదృష్టాన్ని పబ్బునుగూర్చి కలలుగంటున్నదనీ అనుకొంటానుగాని చదువు కావాల నుందని అంటుం దనుకో లేదు.

చదువుకున్న వాళ్లంతా యేం బావుకుంటున్నారు? చిన్నప్పట్నుంచీ యిట్లాటి ఆశల్తో పెరిగినవాళ్లు జీవితంలో భయంకరమైన కలలు కన్నారనీ, భౌతికమైన దృక్పథం అభిరుచులు ప్రాపంచికపు టలవాట్లలో మెసలి తయారైన మనుష్యులు సుఖంగా బ్రతకగలుగుతున్నారనీ చెప్పాలనుకున్నాను.

చేత్తో ఒక బొగ్గు తీసుకుని 'అ...ఆ...' అని నేలమీద వ్రాసియిచ్చాను. చాలా సంతోషంతో నేను చెప్పినట్లు ఆ అక్షరాల్ని దిద్దుతూ మధ్యమధ్యను అవి బండబారిపోతూండటాన్ని అసంతృప్తితో గమనిస్తూ, మళ్ళీ తలెత్తి నా ముఖంలోకి చూసి— నేను చిరునవ్వు నవ్వగానే తలవాల్చి ఆ పొడుగాటి వ్రేళ్ళను బొగ్గుమసిలో త్రిప్పేది.

మధ్యలో నాకోసం బార్లీనీళ్లు పుచ్చుగునివచ్చిన ముసలమ్మగారు, బొగ్గుమసికేసి అర్ధంకాని చూపొకటి విసిరి 'యేవిటే చేస్తున్నావు యిక్కడ—' అని ముఖం చిట్లించగా,

'చదువుకుంటోందండీ నీలి......' అన్నాను ముసిముసిగా నవ్వుతూ. ఆవిడ ముఖం వికృతంగా మారిపోయింది.

'నీ అత్త చూస్తే యింకేమన్నా వుందే...తిట్టిపోస్తుంది.'

నీలికి చాలా పౌరుషం వచ్చినట్లు గమనించాను. శ్రద్ధతో ఆ రెండు అక్షరాలనూ దిద్దటం పూర్తిచేసి 'యిహ వచ్చేసినట్లేనండి.' అంది తృప్తిగా వొక్కమాటు వెన్ను విరుచుకొని.

'చూడకుండా వ్రాయి—' అనటం తడవు గబగబా చేత్తో మసిబొగ్గును తుడిచేసి ఒక అక్షరం కొంతవరకూ వ్రాసి, ఆలోచిస్తున్న ముఖం పెట్టింది.

'నీ మొహం! యీ పద్ధతిని ఎన్నేళ్లు పట్టుందే నీకు చదువు-వచ్చేసరికి...ఆ వేళంతా బొగ్గుమసి చేసేశావు. నీ చదువు పూర్తయే సరికి యీ గదీ గోడలూ యిల్లూ ఆవరణంతా బొగ్గుగీతలు మసితో కలకల్లాడిపోవలిసిందే!'

'నీ పూర్వాయికోవే అమ్మా!' అంటూ అరిచింది నీలి కోపంగా. ఈ ముసలివాళ్లు ప్రతీదీ ఆక్షేపిస్తారు. అన్నింట్లో కలగచేసుకుంటారు. ఏదీ చెయ్యలేరు; కాని ఒకప్పుడు అన్నీ చేశామంటారు.

నీలిని వూరిస్తూ 'రేపు పలకా బలపమూ తెస్తాను నీ' కన్నాను.

ఆ పిల్ల 'అ......ఆ' వ్రాయటం పూర్తిచేసి నవ్వుతూ నా ముఖంలోనికి చూసింది.

'షేష్...' అని నేనూ నవ్వగానే 'పలకవుంటే యింకా దబ్బునొచ్చేస్తాయిగదండీ—'

'అహ్హా!' అని తల వూచాను.

ముసలావిడ శ్రుతిమించుతున్నట్లు గ్రహించినదై—

'నీకేమన్నా పిచ్చా అబ్బాయీ—లేక వాళ్ళ అత్త వేసే అక్షింతలు నువ్వు కూడా నాలుగు పంచుకుంటావా యేం?'

'చూడండి. మీ నీలిని లేడీని చేసేస్తాను' అంటూ వేళాకోళంగా నవ్వాను.

'ఎంత పిచ్చివాళ్లర్రా మీరు!' అని గొణుక్కుంటూ మెట్లు దిగి వెళ్లిపోయింది ఆవిడ.

నీలి వెనకొతలే నాలిక పంటితో నొక్కి వెక్కిరించేసింది. ఒకరి ముఖంలోకి ఒకరు చూసుకుని ఫక్కుమని నవ్వేశాము.

తిరిగి నాకు స్వస్థత చిక్కడానికి పది పదిహేను రోజులన్నా తీసుకొనివుంటుంది. ఉదయపు యెండలో నా గదిముందు వరండాలో రెండు మెత్తటి దిండ్లు వానుకుని నేనూ, రాసిచ్చిన అక్షరాలు దిద్దుతూ చెరిపివ్రాస్తూ నా శిష్యురాలూ—ఆమెలోని ఆసక్తిని వుత్సాహాన్నీ చూస్తూ యెంతగానో మురిసిపోయేవాణ్ని. ఎంత త్వరగా యీమెకు అక్షరాలు వస్తాయి, ఎంత త్వరగా చదవటం వస్తుందీ—అప్పుడెంత గబగబా యీమెకు యీ ప్రపంచము యిందులోని వింతలూ విశేషాలు బోధపరుస్తాను అనుకుంటూండేవాణ్ని.

నా శిష్యురాలిని 'కాలు బాగు చేయించుకుంటావా?' అని వొకమారు అడిగాను. నేను యిచ్చిన వాచకపుస్తకంలోని బొమ్మల్ను చూస్తున్న నీలి ఆత్రంగా 'నిజంగా—నాకు కాలు వస్తుందాండీ' అనేసింది.

'ఓహ్హో!' అని ఆమెకు డాక్టర్లు బుర్రలు విడదీసి అతుకుతారనీ, కడుపులు కోసి రెండు ముక్కలుగ్గా మళ్ళీ కుడతారనీ, ఎముకలు తీసి పారేసి దంతంతో చేసినవి మళ్ళీ చేతులూ కాళ్లూ తెప్పిస్తారనీ, వాళ్లు తల్చుకుంటే యేకీలు కాకీలు వూడదీసిపెట్టి మళ్ళీ మనిషిని చేసేస్తారనీ అద్భుతంగా వర్ణించి చెప్పాను. అవిధంగా నీలికి కాలు వచ్చే ఆశ, ఆ అమాయకురాలైన ముసలితల్లికి కూతురి పెళ్లి ఆశా—రగిల్చి పుణ్యం గట్టుకొన్నాను.

నేను మళ్లీ డ్యూటీలో చేరటంతో ఆమె చదువు వెనకబట్టేసింది. ఈమారు పగలు డ్యూటీ. నా భోజనం స్టేషనుకు హోటలు కుర్రాడే తెస్తూండేవాడు.

బాగా పంద్రెండు గంటలయింది. లైనుమీద బండీ ఫారం (*Form*) చేస్తున్నాను. ఈమధ్యాహ్నలో దూరాన చెట్లకింద పోర్టర్లు గుంపుగా ప్రోగడి గొడవచేస్తున్నారు. ఏ దరిద్రుడైనా షంటింగులో కాలూ చెయ్యీ విరగ్గొట్టుకున్నాడేమోనని అటువైపు పరిగెత్తాను.

ఆ గుంపుమధ్యలో ఎర్ర పరికిణీ, యెండగొట్టిన ముఖమూ, కుంటి కాలు, చేతిలో కారియరుతో నీలి నిల్చొనివుంది. నన్ను చూడగానే వాళ్ల వెకిలినవ్వులన్నీ కట్టడిపోయాయి.

'ఎందుకొచ్చావ్ యిట్లా—' అని కొంచెం కోపంగానే అన్నాను.

'ఇవ్వాళ నవుకరు కుర్రాడు రాలేదు. మీరు అన్నం తినకుండావుంటారనీ...'

'చాలా గొప్పపని చేశావ్—ఇంజన్లూ, బళ్లూ యిట్లా తిరుగుతూంటే యీ పట్టాల్ను బళ్లను తప్పించుకోగల్నవచ్చావా? ఇంకా నా పుణ్యం బాగుంది. నేను చూశాను కాబట్టి...'

నీలి కళ్లల్లో నీరు తిరుగుతూండగా 'యింకెప్పుడూ యిట్లాటి పని చెయ్యనండీ' అంది జాలిగా.

'సరే—పద.' రెక్క చేత్తో పుచ్చుకుని జాగ్రత్తగా పట్టాలు దాటించి, ఎదురుగా కనుపూపుమేరలో పాటిమామిడి చెట్టు పచ్చటి గడ్డి—ఆ నీడలో అక్కడా అక్కడా ఎండ తళుక్కుమని మెరుస్తూండగా యిద్దరం అక్కడ చలికిలబడి అన్నపుగిన్నెలు నేలమీద పరిచాను.

పోర్టరు పరుగెత్తుకెళ్లి కూజాతో నీళ్లు తెచ్చాడు.

నేను అన్నం కలుపుకొని తింటూ నీలికోసం చల్లటి షర్బత్తు తెప్పించి యిచ్చాను. మెల్లిగా షర్బత్తు పీలుస్తూ మధ్యమధ్యనూ మిసమిసలాడిపోతున్న ఎండలోని తెల్లటి మేఘాన్ని ఆశ్చర్యంతో చూస్తున్నది నీలి. రెండు నల్లటి కాకులు వొకదానొకటి పొడుచుకుంటూ క్రిందుగా మా తలలమీద నుంచి పల్టీలు గొడ్తున్నాయి. దూరాన యెక్కడో కుక్క మొరుగుతున్న ధ్వని షంటింగు యింజను చప్పుడులో కలిసిపోయింది.

'చూశావా ఆ లైనుమీద నిలబడివుండే రైలు—దాన్ని యిప్పుడే తయారుచేశాను' అన్నాను నవ్వుతూ.

'అహ్హా!' అంది ఆశ్చర్యంగా నా చేతులకేసి చూస్తూ.

నా ప్రజ్ఞకు నీలి చాలా సంతోషించిందల్లేవుంది. తీసుకెళ్లి మళ్లీ వద్దంటున్నా రిక్షాలో కూర్చోబెట్టి హోటలుకు పంపించేశాను. ఆరోజు నాకు కొంచెం గర్వం వేసింది—నేను అన్నం తినకుండాపోతానేమో అన్న ఆందోళనతో నాకోసం ఒక ప్రాణి వెతుక్కుంటూ రావటమనేది.

అవిధంగా నీలే వెర్రిపిల్లాడికి నామీద విరోధం కలగటానికి కారణమయింది. ఉన్నట్టుండి ఒకరోజున నా గదిలో కొచ్చి,

త్రోసేస్తున్నా మీదమీదకురికి చేత్తో నా చొక్కా పీకి చించేవాడు. నేను చేయెత్తగానే బల్లమీద బోర్లించిన గ్లాసును రోజా ముఖం చూసుగునే అద్దాన్ని నామీదకు గిరాటుపెట్టి పారిపోయాడు. తరువాత నేనా పిల్లవాడిబారినుంచి చాలా తప్పించుకు తిరగాల్సివచ్చేది. ఏమాత్రం యేమరివున్నా నామీదబడి కరవటానికిగాని బట్టలు పీకటానికిగాని సిద్ధమయ్యేవాడు. పులిలా వాడికళ్లు నన్ను చూడగానే జిగేలు జిగేలుమనేవి. నోరంతా తెరిచి పళ్లన్నీ బిగ్గబట్టేవాడు. కాలును నేలకు రాసి ధనాధనామని దగ్గరున్న బల్లనో గోడనో కుర్చీనో తన్నేవాడు.

క్రమేపీ హోటల్లో అంతా—నీలీ నేనూ ముసలమ్మగారు వొకటే అన్న అభిప్రాయంలో కొచ్చేశారు.

నేను హోటలుకువచ్చి దాదాపు మూడునెలలు పైబడినా యజమాని మల్లయ్యకూ నాకూ సన్నిహితత్వం యేర్పడలేదు. ఇద్దరం ముభావంగానే వుంటూవచ్చాము.

'పంతులుగారూ! చిన్నమాట.' అని ఆరోజు తానే స్వయంగా కాఫీ కలుపుకొచ్చి 'పుచ్చుగోండి' అని నాముందు వుంచాడు.

చీకటి పడబోతోంది. మామూలుగానే మల్లయ్య హోటలు ఖాళీగావుంది. సర్వర్లుకూడా యే వీధి అరుగులమీదో కూర్చుని బాతాఖానీ కొడ్తూంటారు. అతను నెమ్మదిగా వుపక్రమించాడు.

'ఎవరు మర్యాదస్తులో యెవర్ని నమ్మకూడదో నేను యిట్టే పోల్చెయ్యగలను.'

నేను తాపీగా కాఫీగ్లాసు పెదిమలకు తాటించి చెప్పమన్నట్లు చూశాను.

'పాపం యిటీవలే జబ్బుపడి లేచారు. మీవంట్లో యిప్పుడు మామూలుగా వుంటోందా?'

'డ్యూటీ చేసుకుంటున్నాను.' అని నాలుగువైపులా వొకమారు చూసి సిగరెట్టు ముట్టించాను.

మల్లయ్య మీసాలక్రిందనుంచి నవ్వాడు.

'ముసలమ్మగారు నాకు జబ్బుచేశాక సిగరెట్టు ముట్టుకోవద్దని ఆంక్షవేసి నీలిని కాపుంచిందిలెండి. అందుకని—

'మీకైతే దాని అంగరక్షులకు ఎల్లా చిరాకు రావటంలేదో నాకుమట్టుకాశ్చర్యంగానే వుంది సుమండీ—'

మా యిద్దరిమధ్యా సిగరెట్టుపొగ చిన్న మేఘంలా లేచి అడ్డుకుంది. మల్లయ్య అందుకున్నాడు. 'మా అక్కయ్య యీ కుటుంబ వ్యవహారాలు సందర్భకూ కొంత మీకూ చెప్పేవుంటుంది లెండి.'

'నేను యిరుకునపడి యేమంటే యేం ప్రమాదమోనని ఆలోచించుకుంటున్నాను.

'దాని డబ్బుకూడా సుమారు మూడువందల చిల్లర నాదగ్గరుంది లెండి. మా నీలికి మూడేళ్లప్పుడు, భర్త పోగానే వచ్చేసింది. చెప్పేవుంటుంది మీకు.' అతి కష్టంమీద 'హాఁ!' అనకలిగా—

'నీలికి కాలు బాగుచేయించాలని కూడా అని వుంటుంది లెండి.'

తలకాయ వూపాను.

'అసలు నేనే ఆ పనికి పూనుకున్నాను. ప్రతిమాటూ యేదో విఘ్నమే. నాభార్య నీలికి కాలు బాగుచేయిస్తే వాళ్ళ అమ్మ మరో సంబంధం చేస్తానంటున్నది అని గొడవపెడ్తోంది. దాని దుగ్ధయేమంటే, తెలిసిన మేనత్తే తన అనాకారి పిల్లను యివ్వటాని కిష్టపడకపోతే యిక యెవరిస్తారు గనుక ఆలోచించమంటుంది.'

పులిలా గ్రుడ్లు పెట్టుకుని అద్దాలు గాజుగ్లాసులుమీదకు విసిరే ఆ వెర్రిపిల్లాడి పెళ్లివ్యవహారం నామెడకు చుట్టుకోబోతున్నది. ప్రపంచంలో యిద్దరు రూపవంతులైనవారికి వివాహం కావటమూ అతి కష్టంమీదనే జరుగుతోంది. ఇద్దరూ అనాకారులు, రూపహీనులైనా వాళ్లకు వివాహం కావటమూ కష్టతరంగానే పరిణమిస్తోంది. ఏం చిత్రం?

'మీరు చెప్పిచూడండి. ప్రస్తుతం నా భార్యదగ్గర కొంత పైకంవుంది. నీలికి వైద్యం ఆరంభించవచ్చు. ఆడవాళ్ల నోరు నొక్కిపట్టి అణచీ మనం యేం సాధించగలం చెప్పండి. నాభార్య మట్టుకు సవబులేకుండా అడగటంలేదు. అభిప్రాయాలు మనకైతే లక్ష వుండొచ్చు, చూడండి యితరుల వుద్దేశాల్నికూడా మన్నించాల్సి వుంటుంది.'

'అవునులెండి. నేనుకూడా తప్పకుండా చెప్పిచూస్తాను.' అని లేచి నెమ్మదిగా మేడమీదకు జారుకున్నాను. అయ్యో—వాళ్ళ బ్రతుకులు అట్లా గడపనియ్యకూడదా—యీ కలపాలనే తాపత్రయం యెందుకు? నామట్టుకు ఎంత ఆలోచించినా నీలిని కుంటిపిల్ల గదా అని వెర్రిపిల్లాడి కిమ్మనడంలో సవబేమీ కన్పించలేదు.

మరునాటి వుదయం మెట్లదగ్గర నవ్వుతూ పలకరించింది యెల్లప్పుడూ ధుమధుమలాడ్తున్నట్లుండే ముఖంగల మల్లయ్య భార్యకూడా. ఏవో ఆశలను చిలుకరించుకొని నవ్వే ముఖాలమాటున ఆలోచనల కారుమేఘాల గుబురులో చిక్కడి నేనొక్కణ్ణే ఆలోచించుకోసాగాను. ఈ మనుష్యులు యేమేమో అనుకుంటారు. ఏవేవో ఆశలను పెంచుకొంటారు. కాని వాట్ల సాధనలో యిరుకునపడి నలిగిపోయే చిన్న చిన్న హృదయాలను గుర్తించి కనికరించటమనేది యెప్పటికి అలవర్చుకుంటారు?

రెండు పచ్చకాగితాలను చేత్తో పుచ్చుగొనివచ్చి—'నాయనా మీరీ వుపకారం చెయ్యాలి. ఆడకూతుర్ని నోరుతెరిచి అడుగుతున్నాను. మా నీలికి కాలు బాగయే సదుపాయం మీచేత్తో కానిచ్చినట్లయినా ఎంతన్నా సంతోషిస్తాను.' అంది మల్లయ్య భార్య.

తరువాత నేను డాక్టర్ను కలుస్తానని మాటయిచ్చి, నాకు తెలియకుండానే మధ్యవర్తిత్వం నెత్తిన వేసుకుని, ఆ మర్నాడు ఆసుపత్రిలో నీలిని చూపించాలని నిశ్చయించేశాను.

ఆరోజురాత్రి బాగా ప్రొద్దుపోయాక గదికి చేరుకొని పడుకునే యత్నంలో వుండగా కామోసు—నీలి తలుపు త్రోసుకుని వచ్చి మూగదేవతలా తలకాయ వొంచుకుని నిలబడిపోయింది. తలెత్తి చూశాను. టప్పటప్పమని కన్నీరుచింది నేలమీద పడ్తోంది. లాంతరు వొత్తి పెద్దదిచేసి చేత్తోపుచ్చుకుని లేచాను.

దగ్గరసావెళ్ళి 'ఏం కావాలి? చెప్పవ్—' అని ఆమె చేయి పుచ్చుకుని మృదువుగా అడిగాను. మళ్ళీ ఎర్రపావడా కట్టుకుంది. తల్లో చిన్న గన్నేరుపువ్వు...గాజులు కదుల్తూ సన్నగా ధ్వనిస్తూండగా 'మేం ఇక్కడ్నుంచి వెళ్లిపోతామండి.'

'ఏం?' వులిక్కిపడి అన్నా.

'మా వూరుపోతే అమ్మా నేనూ యెక్కడైనా పనిచేసుకు నన్నా బ్రతకగలమండీ.'

'వోహ్హో! అవశ్యం వెళ్లొచ్చు. అల్లా తిన్నగా వెళ్లిపోక మళ్లీ యిక్కడకు ఎందుకొచ్చావ్?' నేను నవ్వేశాను.

నీలి చెక్కిళ్లు కాస్త సిగ్గుతో యెరుపెక్కాయ్.

'ఐతే నేను రేపు డాక్టరుగార్ని కలవనక్కర్లేదు. ఇంక ఆసుపత్రి కెందుకు వెళ్లటం...'

'వొద్దండీ. అంత డబ్బు మా కెక్కడ్నుంచి వస్తుంది గనుక''

'పోనీ నాడబ్బు నా కిచ్చేస్తావా? నేను పెట్టుబడి పెడ్తాను నీ కాలికి.'

'వద్దండీ. మమ్మల్ని వెళ్లిపోనివ్వండి. నాకు భగవంతుడే చాలా అన్యాయం చేశాడు.' మిగిలినది ఆ పిల్లాడిచేత పసుపుకొమ్ము మ్ముడేయించి మా అత్త పూర్తిచెయ్యాలని చూస్తోంది.'

'ఐతే మరి నాలాగే పెళ్లిచేసుకోకుండా వుంటావా యెప్పుడూ?'

'కాలువస్తే మట్టుకు నేనెందుకు పనికివస్తానండీ.'

'పోనీలే - నువ్విట్లారా●.'

నీలిదగ్గరసా వచ్చి నిలబడింది.

'ఆవాళ గది కాళీచేస్తానన్న రోజున రాత్రికిరాత్రి నలుగురిలో చెట్టంత మనిషిని పిచ్చివాడిక్రింద చెలామణీచేసి యిప్పుడు నాతో నిమిత్తం లేకుండా ఎక్కడికి పారిపోదామని చూస్తున్నావ్?' అని చేతులు రెండూ పుచ్చుకున్నాను.

విదల్చుకొంటూ 'మీకు కోపం వచ్చిందల్లేవుందే?' అంది.

'అహ్హా! రాదా మరి–' అని నేను లోనికివచ్చి ప్రక్కమీద వొత్తిగిల్లాను. కిటికీతలుపులు బార్లా తెరిచివున్నాయి. దూరాన నక్షత్రాలు స్పష్టాస్పష్టంగా మెరుస్తున్నాయి. హృదయం తేలిగ్గావుంది. ఒకఅల్పజీవికి బ్రతుకుమీద బ్రహ్మాండమైన ఆశను రగుల్కొల్పాను. పైకనలేపోతున్నదిగాని అందరాడపిల్లలకు మల్నే మనస్సులో మంచి మొగుడ్ని దాచుకుని, ఆ మిణుగురు పురుగుల్లాటి కళ్ళతో తనివితీరా చూస్తూ, పుడకల్లాటి చేతుల్తో చుట్టేసుకుని యీ నలిగిపోయిన హృదయాన్ని నైవేద్యం చేద్దామని నీలికూడా ఆశిస్తూండవచ్చు. వెర్రిపిల్లాడి అయోమయ దృక్కులు ఆ బాలిక హృదయ కవాటాలను ఫిరంగి గుండ్లతో పేల్చినట్లుకాగా, పాపం ఆ బాధనుంచి ఎట్లా తప్పుకోగలదు? అయ్యో! అర్భకురాలు...నిస్సహాయ జీవి!—నేనో, నా రోజారంగుపిల్ల యేమైంది? పాలమీగడ కుచ్చెళ్లు చిన్ని గులాబీ వన్నె లేతపాదాలు...కంపించే పెదాలతో మళ్ళీ వొక్కమాటు...ఎట్లాగున్నానో అని నన్ను చూడ్డానికి రాకూడదూ? నాకు రెక్కలొచ్చాయి. గాలిలో పైకిలేచాను. చెట్లమీదనుంచి పరుగెత్తాను. అల్లా ఎగుర్తూ సంద్రాల్ని దాటాక అడవుల్ని చూశాను. పెద్దపెద్ద పట్టాణాలు భవనాలు వనాలు అన్నీ గాలించేశాను. వృధా—యేడుస్తూ అలసిపోయి హొటల్లోని గదిలోకే వచ్చిపడ్డాను. నాహృదయం లోపలంతా శూన్యం...అరణ్యం భగ్గున మండితే చూడాలనిపించింది. త్రాచుపాములు పట్టుగుని పీకితే హాయిగా వుంటుందేమో...బండరాళ్ళను వేసి తలబ్రద్దలు కొట్టుకున్నా బాగుండుననిపించిందాయె! లాభంలేదు. సుఖమూ సంతోషమూ నువ్వు యితరులకు యివ్వాలిసిందే గాని నీ కెవ్వరూ యివ్వరు. అదృష్టం లేదనుకుని గట్టిగా హృదయ కవాట్లాలు మూసేసుగుని 'నాకేమీ అక్కర్లేదు. నేనే అందరికీ యివ్వాలి' అని బిగ్గరగా చాటుకున్నాను.

గుండెలు చేత్తో పుచ్చుకుని తడబడుతూన్న కాళ్ళతో నీలిని వెంటేసుగుని పెద్దడాక్టర్ను కలిశాను. నా ప్రాణాలు బితుకు బితుకుమంటున్నాయి. డాక్టర్ల ప్రజ్ఞను గురించి చాలా కోతలుకోసి వందుకు నొచ్చుగున్నాను. ఐదు పది కాగితాలు సమర్పించుకుని బ్రతిమాలాను. డాక్టరు ముఖం చిట్లించాడు. నీలికికూడా భయంగానే వుంది. ఆ వికారమైన నీలికేసి అదేపనిగా చూశాక, ఆంగ్లంలో—'లాభంలేదు. ఈపిల్ల తట్టుకోలేదు. చాలా పెద్ద ఆపరేషను చేసి బొవిక మార్చాలి. అప్పటికీ ఆ కాలు నడవటానికి మాత్రం వుపకరించవచ్చు' అన్నాడు.

వెళ్ళి ముసలమ్మగార్ని తీసుకొచ్చాను. ఆవిడ డాక్టరు కాళ్లావేళ్లా పడి 'బీదవాళ్ళం...పిల్లకు పెళ్ళికావాలి. కాలులేందే యెవడు చేసుగుంటారు బాబూ!' అని చెప్పగుంది.

డాక్టరు పక్కుమని నవ్వేశాడు. ముసలమ్మగారు ఆయన బూటుకాళ్ళను రెండుచేతుల్తో పట్టుగోబోయింది. గోడవారను నిలబడివున్న నీలి చెంపమీద చిన్న దెబ్బవేసి 'నీకూ పెళ్ళి... వొహ్హో! ఐతే అవశ్యం నీకు కాలు యివ్వాలిసిందే...' అని నవ్వేసి వెళ్ళిపోయాడు.

నీలి అచ్చం పెళ్ళికూతురిలానే సిగ్గుపడ్డది. ముసలమ్మగారి ముఖం చింకి చేటం తవటంకూడా గమనించాను. అరచేతిలో చేయివేసి నలుపుకుంటూ 'డాక్టరు బాబు చాలా మంచివారే...' అని వొకమారుగాదు పదిమార్లు వల్లించుగున్న దావిడ. ఆరోజే సర్జికలు వార్డులో నీలిని చేర్పించటం జరిగింది. మేం తిరిగివచ్చేసరికి మల్లయ్యా, భార్యా, నవుకర్లు—వెర్రిపిల్లాడు అంతా పరంగుల మెట్టమీది బొమ్మల్లా చూస్తున్నారు. 'చేర్పించేశారా—' మల్లయ్య మీసాలు కొరుక్కుంటూ అడిగాడు. నీలిని యెత్తుకొనిపోయి ఎక్కడో దాచేశానని వెర్రిపిల్లాడు కోరచూపులు చూస్తున్నాడు.

'వోశే...డాక్టరు యెంత మంచివా రనుకున్నావ్? నీలికి తప్పకుండా కాలు తెప్పిస్తానన్నారు.' అంటూ చెప్పింది ముసలమ్మగారు.

ఆ మధ్యాహ్నం—మల్లయ్య భార్య కొడుకును తిడుతోంది.

'వెఱ్ఱివెధవా—నీకెందుకురా యింత మమకారం? అది కనబడ్డంలేదని తిండి తినకుండా ఛస్తావా? వొక్కచోట పెరిగామే అన్న అభిమానం దానికి లేకపోయింది.' వాడు అస్తమానూ హాస్పిటలంతా కలియదిరిగి అందరి గదుల్లోకి తొంగిచూసి మళ్ళీ వీధిలోకొచ్చి వొకమారు చూశాక లోనికి పోతూండేవాడు. ఆ అమాయక హృదయం ఎంతగా దహిస్తున్నదీ నేను గుర్తించాను. ఆ పిల్లాడు క్రమంగా అనుకోనంత చిత్రంగా మారిపోయాడు. గంతులు, డబ్బాలు—గ్లాసులు, తిరగదొయ్యటం, తన్నటం, లాటిచేష్టలు మానేశాడు. ఏదో మూల బల్లిలా గోడను అంటుకుని మూగగొడ్డులా కుమిలిపోవటం చూశాను. ముసలమ్మగారుగాని, నేనుగాని ఆసుపత్రికి వెళ్ళేటప్పుడు వచ్చేటప్పుడు చూసినట్లయితే, రెండు చేతుల్తో ముఖాన్ని కప్పుకుని యేడ్చేవాడు. 'మీరే వాడి దుఃఖానికి కారణ'మన్నట్లు చూసేది మల్లయ్యభార్య. ఒకమారు వాడ్ని రెక్క చేత్తో పుచ్చుకుని లేవనెత్తి 'రా బాబూ! నీకు నీలిని చూపిస్తాను.' అంటోంది. వాడు వెంటబడుతూండగానే ఎక్కణ్నుంచి చూసివచ్చి పడిందో తల్లి—వొక్క విసురున వాడిని త్రోసేసింది. ఎట్లాగో తల్లిని త్రోసి తప్పించుకుని వాడు వీధిలో ఉరకబోతున్నాడు. ఏవిటంటూ మల్లయ్య ప్రక్కతలుపు త్రోసుకుంటూ వచ్చాడు.

'చూడండి. ఈ సిగ్గులేని వెధవ పడిపోతున్నాడు ఆసుపత్రికంటూ—' అతను చూస్తూండగా వొంటికాలుమీద లేచాడు. ఒక ప్రక్కగా నిల్చుండి బిత్తరచూపులు చూస్తున్న ఆ చేట చెవుల గ్రద్దముక్కు కొడుకుమీద. తన్నగా ఫెడీల్మని వాడు లుంగలు చుట్టుకుని నేలమీద పడ్డాకకూడా, మల్లయ్యలోని పశుత్వమంతా విజృంభించగా చేతుల్తో కాళ్ళతో చితక బాదుతున్నాడు. కేరియరు విసిరేసి ముసలమ్మగారు అడ్డుపడబోయి సాధ్యంకాక 'చంపకురా...వాణ్ణెందుకు...చంపకురా!' అని అరుస్తోంది యేడుస్తూ. నిష్కారణంగా చచ్చిపోతాడేమో ననిపించి గబగబా మధ్యకు వెళ్ళి మల్లయ్యను బలంగా నెట్టి కుర్రవాడ్ని లేవనెత్తాను.

'వుండవయ్యా...నివ్వు. కనిగొట్టు వెధవ. చచ్చాడన్నా కాడు.' పిల్లాడు పూర్తిగా సొమ్మసిల్లాడు. వీపు డొక్కపోయి నెత్తురు కారుతోంది. రైలుపట్టాలక్రింద పడి నలిగినగొడ్డు, కారు క్రిందపడ్డ కుక్కలా వున్నాడు.

ముసలావిడ తమ్ముడ్ని నోటికి వచ్చినట్లల్లా తిట్టేసింది ఆవ్వాళ. ఈవాళ చేస్తాను రేపుచేస్తాను అంటూ డాక్టరు నెలరోజులు గడిపాడు నీలికి ఆపరేషను. ఒకరోజు ఆలస్యమైతే ఒకరోజు పెళ్ళి వెనక్కుపోయినట్లుగా ముసలమ్మగారు లెక్కలు కడ్తోంది. ఈ నెల్లాళ్ళలోనూ అద్భుతంగా మారిపోయింది నీలి. చిక్కటిపాలు త్రాగుతూండటంచేత శరీరానికి కాస్త మిసమిసలు వచ్చాయి. డొక్కపోయినట్లుండే చెక్కిళ్ళు కోలముఖం కాస్త గుండ్రంగా తయారయింది. నడుందగ్గర్నుంచి చూస్తే మనిషి బంతిలాగయింది. నవ్వినప్పుడు కొత్తముఖం చూడాలనిపిస్తోంది. పెదాలు ఎరుపెక్కాయి.

నా సంతోషం యేమని చెప్పగోను?

రోజూ చిన్న చిన్న బహుమతులు పట్టుకెళ్ళి యిస్తూవచ్చాను. రిబ్బనులు జడపిన్నులు. పూలు రకరకాల గాజులు వొకటేమిటి, నాకు తోచిందల్లా కొనుక్కెళ్ళి ఆమె ముందు కుప్పగా పోసేవాడ్ని. హృదయందగ్గర్నుంచి ఆఖరికి జడపిన్నువరకూ యేదన్నా యితరులకు యివ్వటంలో యెంత ఆనందం వుందో అప్పటివరకూ నాకు తెలీనే తెలీదు. ఇంకా ఆ కళ్లు రెండూ వికారంగానే వున్నట్లు తోచాయి. సాయంత్రాలు ఆసుపత్రివరండాలో బల్లమీద కూర్చుంటే - చల్లటిగాలి, యెదురుగుండా జాగ్రత్తగా పెంచిన చిన్నతోట, దాంట్లోని పచ్చటి రకరకాల మొక్కలు, అస్తమించే సూర్యబింబం, ఆకాశంలోని రంగు రంగుల పిట్టలు కనిపించేవి.

నీలి, సిమెంటుబల్లమీద, ఎదురుగుండా గడ్డిలో నేనూ ముసలమ్మగారూ కూర్చొని కబుర్లు చెప్పుకునేవాళ్లం. అప్పుడప్పుడు ఆ వూతకర్రను గడిలో దాచేసి తమాషాలుచేసి, నీలిముఖంలోని ఆత్రతకూ నిస్సహాయతకూ నాలో నేను నవ్వుకునేవాడ్ని.

'ఏమండీ నీలికి కాలువస్తే తప్పకుండా బాత్ రూంశాండల్స్ కొనిపెట్టాలండీ' అన్నా.

'అంటే...' అని అమాయకంగా అడిగింది నీలి.

మకేసి చూస్తూన్నవాడ్ని చప్పున నా జేబులోని చలవ కళ్ళజోడును తీసి బలవంతాన ఆమెముఖానికి తొడుగుతూ - 'చూడండి. మీ అమ్మాయి లేడీలా లేదూ?'

నీలి చేత్తో అద్దాల్ని తీయబోయింది.

'చెబుతున్నా. — తీశావా మళ్ళీ నీకూ నాకూ పేచీవస్తుంది.' అని గసిరాను.

'అమ్మా మరైతే అద్దం తెచ్చిపెట్టవే. ఎట్లాగుందో చూసుకోవాలి' అంది.

ముసలమ్మగారు నవ్వుతూ లేచింది.

'నాముఖం ఎట్లావుందో యెదురుగుండావున్న వాళ్ళ ముఖమే అద్దంకన్నా స్పష్టంగా చెబుతుందన్నావుగా—మళ్లీ అద్దం ఎందుకంటూ' యెత్తి పొడిచాను.

'నిజమే. నిజమే నే—అమ్మా! అద్దం అక్కర్లేదే...' అని గట్టిగా కేక పెట్టింది ముందు పోతున్న తల్లికి వినపడేలా.

అంతలో హఠాత్తుగా మలుపు తిరిగి వస్తూన్న డాక్టరు చలవ అద్దాలు పెట్టుకున్న నీలిని ఆశ్చర్యంతో చూసి ఆగి 'ఏవమ్మాయ్? చాలా ఖులాసాగా వున్నావే?' అని నవ్వాడు.

నేను నమస్కరించాను. కంగారుగా కళ్ల అద్దాలు వూడదియ్యబోయింది కాని ఒకప్రక్క జుట్టులో చిక్కడ్డంచేత నేనే ఆమెకు సాయం చేయవలసి వచ్చింది.

'మీరిద్దరూ యేమవుతారు?' అని డాక్టరు నీలిని అడగ్గానే నేను తెల్లతెలబోయాను. నాకేసిచూసి నీలి తలవాల్చేసింది. అద్దం పుచ్చుకుని వస్తున్న ముసలమ్మగారు 'డాక్టరు బాబూ దండం' మంటూ చేతుల్ని జోడించింది. ఆయన ముందుకు అడుగులు వేస్తూ 'పెళ్ళికొడుకు దొరికాడా?' అని ప్రశ్నించాడు నవ్వుతూ.

'ఏదిబాబూ తమరు కాలు యిచ్చాకగదా దాని అదృష్టా దృష్టాలు బయటపడేది?' అని ముసలమ్మగారు చెప్పింది.

ఆమెకేసి చూసినంతసేపూ ప్రశ్నించుకున్నాను — యీమె నాకేం కావాలని? నీ...లి...నా...కే...మీ...కా...దు. ఈ మిసమిసలాడే పిల్లా వెనుకటి ఆవికారమైన రూపూ, రోజారంగు పిల్లా—యేదీ సత్యం కాదు. ఇహనుంచి యేంచేసినా నిష్కామ కర్మగానే చేయాలనే తీవ్రనిర్ణయానికొచ్చేశాను. మునుపు చిన్న పిల్లతో ఆటలాడినట్లుగా కేరింతాలు కొట్టినట్లుగా వుండటం మానేశాను. దూరంనుంచే మంచి చెడ్డలు యోగక్షేమాలు కనుక్కొని వెళ్ళిపోతూండేవాణ్ని. తగినంత అవసరంవస్తేగాని చనువుగా నీలిమీద చేయి వెయ్యనని తీర్మానించుకున్నానుకూడా. ఈ మార్పు నాలో పసిగట్టాక నీలికి నాయెడల భయభక్తులు మరీ హెచ్చాయి. చూడగానే చేతులు జోడించి దండం పెట్టడం ప్రారంభించింది. చనువైన స్నేహితుడిగా మెసలిన నేను క్రమంగా గౌరవప్రదమైన స్థానాన్ని ఆమెలో సంపాదించుకోవటంతో మామధ్య కొంత అంతరం యేర్పడింది. దాన్తో మనిషికూడా దిగాలుపడ్డట్లు కనిపించేది.

ఆపరేషన్ చేసేరోజు దగ్గరకు వచ్చింది. ఆరోజు నా గంభీర ముద్ర యీవత్తూ పటాపంచలు కావలసిందే. కాని—అదృష్ట వశాత్తూ మల్లయ్యా, భార్యాకూడా వచ్చారు. ఆపరేషను రూంలోకి తీసుకుని పోయేముందు నీలి కళ్ళనీళ్లు బెట్టుకుని అంతసేపూ నా ముఖంలోకే చూస్తోంది. ఏమో చెప్పాలనుంది, కాని ధైర్యం చాలటంలేదు.

'నీకేమీ భయంలేదు నీలీ. తుడుచుకో చెంపలు...' అని సర్ది చెప్పాను. కాని నాకు కాళ్లు ఆడ్డంలేదు. నేనెప్పుడూ యిట్లాటి అవస్థలో చిక్కడలేదు. మల్లయ్యా, భార్యాకూడా దగ్గరకువచ్చి చేత్తోతట్టి—'భయంలేదే! డాక్టరుబాబు చాలా మంచివారు' అని ధైర్యం చెప్పారు. ముసలమ్మగారు గుండెను రాయిచేసుకుని బల్లమీద కూర్చున్నది.

నీలి యింకా అసంతృప్తిగా చూస్తూండటంచేత నేను స్ట్రెచర్‌తో విధిగాకూడా ఆపరేషన్ థియేటరువరకూ వెళ్ళాను. డాక్టరు 'ఏడవకమ్మా— నేనేంచేస్తానో నీకు చీమ కుట్టినట్లుగా కూడా తెలీదు.' అని నవ్వాడు. అట్టుండరు నన్ను సన్నటిదారిలా వున్నచోట చిన్నబల్లమీద కూర్చోమని నీలిని లోపలికి తీసుకెళ్ళి పోయాడు.

'యీ నరకంలోనికి త్రోయటానికే యీ పిల్లకు కాలు వస్తుందనే ఆశ కల్పించానా' అని బాధపడ్డాను. అరగంట పోయాక బేసినుతో నెత్తురునీళ్లూ తుక్కూ పుచ్చుకుని ఒకనవుకరు యీవలకు రావటం చూశాను. నాకళ్లు చెదిరాయి. నేనేంచేశాను? ఒక అమాయకురాలికి భవిష్యత్తుపై ఆశ కల్పించి యీ కత్తికోతలు పడమని త్రోశాను. మూడుగంటలు యిద్దరు డాక్టర్లు యింకా పన్లాసు సర్జనులు నర్సులు పరుగులెత్తుతున్నారు. పనిముట్లు 'స్టౌ' లో మరగబెడ్తున్నారు. తరువాత డాక్టర్లు నెత్తురు మరకలతో నిండిన రబ్బరు గౌనుతో 'యీవలకువచ్చి నాకేసిచూసి 'పూర్తయింది.' అని గంభీరంగా అన్నాడు. అయ్యో! ఆ నెత్తురంతా నీలిదేనా? మరో పది నిముషాల్లో స్ట్రెచరుమీద మనిషిని పడేసి యింకా పచ్చిగా కారుతున్న నెత్తురుముద్దను స్పృహలువార్డులోకి తీసికెళ్తూండగా చూశాను. చూసి కెవ్వుమని కేక పెట్టలేక చేరుమాలుతో నోరు నొక్కుకున్నాను. అంతకన్నా శవం నయం. నా అంతర్యంలోని తుఫాను యేమని చెప్పుకోను? ఎవరన్నా చూస్తారన్న అభిమానమన్నా లేకుండా గోడవారను చేరగిలబడి యేడ్చేశాను. కళ్ళు నులుముకుంటూంగా మల్లయ్యా భార్యా ముసలావిడ 'యేది? యేది?' అంటూ నావైపు వస్తున్నారు.

మీ అందరికీ తలో అబద్ధమూ చెప్పి నమ్మించాను. మీ నీలిని యీ ఆసుపత్రిలోని కత్తులన్నీ ముక్కలు ముక్కలుగా కోస్తూంటే ముద్దులా బల్లమీద కూర్చొని కళ్ళప్పగించాను. మీ అమ్మాయి నెత్తురుచిందిన డాక్టరుగారి కోటునుకూడా చూశాను. ఇంకా నేనేదో ఆ జన్మాంతమూ మరపురానివుపకారం మీకు చేసినట్లుగా నన్నే వెంబడిస్తున్నారే అనిపించింది.

అంతా కలిసి స్పృహలువార్డుదగ్గర కెళ్ళాము. కాని నేను యీ అబద్ధపుముఖం వేసుగుని ధైర్యంగా ఆపిల్ల ముఖాన్ని ఎట్లా చూడగలను? బయటే నిలబడ్డాను. మల్లయ్యా అతడి భార్యా 'తన నెత్తురు ముద్దను' చూసి లబోదిబోమంటున్న ముసలమ్మగార్ని నెమ్మదిగా యీవలకు తీసుకొచ్చి వూరడిస్తున్నారు.

ఉదయం పది పదకొండు గంటలకు పూర్తయిన ఆపరేషను మనిషికి తెలివివచ్చేసరికి నాలుగున్నరఅయింది. మాట్లాడానికి వెళ్ళి తలాటదిక్కున నిలబడ్డాను. 'తల్లీ...' అంటూ ముసలమ్మగారు, దీనంగా నిలబడ్డ మల్లయ్యభార్య ముఖాలను—కళ్లు విప్పి చూసింది. చెంపలనుంచి నీరు వెచ్చగా స్రవిస్తున్నది. నేను చేత్తో తుడవబోయాను. సర్జను ముట్టుకోనివ్వలేదు. చేయి వెనక్కు లాక్కుంటున్నాను. తలత్రిప్పబోయి నీలి గట్టిగా మూలిగి మళ్లీ మత్తులోకి జారుకున్నది.

డాక్టరు ఒక యింజక్షను యిచ్చాడు. బాండేజీని పచ్చి నెత్తురు యెండిపోతూవుంది. డాక్టరుమటుకు చాలా గంభీరంగానే వున్నాడు. వెళ్లిపోతూ జాగ్రత్తగా కనిపెట్టుకు చూడవలసిందనీ, గంటగంటకు యింజక్షను యిచ్చి మనిషిని తట్టుకోనేలా చూడమనీ చెప్పాడు.

నిశ్శబ్దసంపుటాల్లాగా అంతా వరండాలో బెంచీలమీద కూర్చున్నారు. ప్రక్కదగ్గర చిన్న స్టూలుమీద కూర్చుని నేను ఆమెకేసే చూస్తున్నాను. సన్నగా వూపిరి పీలుస్తూ వదులుతున్నది. మెడదాకా తెల్లటి దుప్పటి వున్నది. ఆ తల్లో యింకా నేను కొనిచ్చిన పిన్నులు జుత్తును చెదరనివ్వకుండా అదిమివుంచాయి. ముఖం బాధాదష్టమై అగపడ్తోంది. గంటగంటకు యింజక్షను... బాగా రాత్రి తొమ్మిదికూడా కొట్టాక నీలి కళ్లు విచ్చి చూసింది.

దగ్గరసా వంగాను. కళ్లు నీటిని నింపుకుంటున్నాయి. నేను వణికే గొంతుకతో 'ఎట్లా వుంది నీలీ?' అన్నాను.

'ఏ...ం...చె...ప్ప...ను...?' అని మాత్రం అనగలిగింది.

'అమ్మనూ వాళ్లనూ పిలిచేదా?'

జాలిగా చూస్తోంది 'వూ' అని.

మళ్లీ అంతా చుట్టూ నిలబడ్డాము.

'ఏం కావాలి తల్లీ?' అంది ముసలమ్మగారు.

'నా...కే...ం...... కా...వా...ల...మ్మా...' అంది యేడుస్తూ.

'ఏడవకమ్మా...' అంటున్నాడు మల్లయ్య.

మళ్లీ తెలివిపోయింది. ఈమారు ఆఖరి రౌండుకు డాక్టరే వచ్చి చూసి బాండేజీ అదీ పరీక్ష చేసి మరో యింజక్షను యిమ్మని చెప్పి వెళ్లిపోయాడు. అంతా వరండాలో బెంచీలమీదపడి నిద్ర పోయారు. నాకు నిద్ర ఎట్లా పడుతుంది? సిగరెట్లు కాలుస్తూ వరండాలో పచార్లు చేస్తున్నాను. సన్నగా మూలిగినట్లు అనుమానం వేసింది. వెళ్లి ప్రక్కదగ్గర నిలబడ్డాను. గొణుగుకుంటోంది. చెవి దగ్గరసా పెట్టి విందామనుకున్నాను. ఏడుపులో ఆ మాటలు తెలియ లేదు. తర్వాత మళ్లీ అనుకుంటోంది, 'నాకు కాలు వస్తుందా?' అని. అక్కడ్నుంచి లేచాను. తెలివి తెరలకుమల్లే వచ్చి తప్పుతుంటోంది. ఇక మళ్లీ నిద్రపోవటంకూడా కష్టమే. దగ్గరసా వెళ్లి చేత్తో భుజంమీద తట్టాను. కళ్లు విప్పకుండానే దుప్పటి అడుగు నుంచి నాకు చేతులు అందివ్వబోయింది. నెమ్మదిగా ఆ చేతులను అందుకుని తలకాయ వంచి వాటిలో నా ముఖం వుంచాను.

నన్ను గుర్తు పట్టిందో లేదో, పలవరిస్తున్నదో కాని—నెమ్మదిగా అంటున్నది 'నాకు పెళ్లవుతుందా? నన్నెవరు చేసుకుంటారు?' అని. స్టూలుమీద కూర్చున్న నేను తలెత్తి నా నిష్కామ కర్మపిచ్చినంతా వెనక్కి నెట్టి అడిగాను—

'అడుగు నీలీ—నీకేం కావాలన్నా అడుగు, చెప్పు. ఏం కావాలి?'

'నాకు కాలు వస్తుందాండీ?'

ఒకప్రక్కనుంచి నా హృదయం బీటలువారుతున్నా అణచుకుంటూ అన్నా—'తప్పకుండా వస్తుంది.'

నాకే తెలియదు భగవంతుడు యేం చేయనున్నాడో...

నా చేతులు తన చేతుల్లోకి తీసుకుని గుండెలవరకూ నీరసంగా లాక్కుంటూ 'నాకు పెళ్ళవుతుందాండీ?' అంది.

'అహా...తప్పకుండా—'

ఒకప్రక్క దిండుమీద విసిరేసినట్లున్న తలను చేత్తో నిమురుతూ ఆప్యాయంగా అన్నాను.

కళ్లు తెరిచి నా ముఖంలోనికి చూస్తూ అంది 'నన్నెవరు చేసుకుంటారు చెప్పండి' అని.

ఒక్కక్షణం ఆలస్యం చేశాను.

మళ్ళీ తెలివి తప్పిపోయింది. నేను మరో సిగరెట్టు తీసి యీవలకు వచ్చి ముట్టించాను. అమ్మవ్వన మేం కబుర్లాడుతూ రోజా కూర్చునే బల్ల, చిన్నతోటా—రకరకాల పచ్చటిచెట్లూ, అన్నీ చీకట్లో నిద్రిస్తున్నాయ్. నక్షత్రాలు అబద్ధాలాడే మనుష్యుల ముఖాలు చూడలేకగావల్ను చిన్నబుడ్డుగున్నట్లు సన్నగా వెలుగుతున్నవి. ఒకప్పుడు ముష్టిపిల్ల అని జేడా మీదకు విసిరేశాను. కంటకనుపిస్తే ఛీ పొమ్మన్నాను. తల్లి యెదురుగ్గా బిడ్డను అసహ్యించుకున్నాను. కాని యేం సంబంధం లేకపోతే యిప్పుడు యీ వరండాలోపడి—నీకు మంచిరోజు లున్నాయని ఆశబెట్టిన నేను నీలి ముఖం చూడ్డానికి భయపడ్తున్నాను? మళ్ళీ అడుగుతుంది. ఏం చెప్పను?

దూరాన వుండీ వుడిగీ ఏదో లారీకాని బస్సుకాని పరుగెత్తుతున్న ధ్వని, ఏదో మూలనుంచి పరుగెట్టే వస్తూన్న రైలుచప్పుడు గాలిలో కొట్టుకొస్తున్నాయి. హఠాత్తు సర్జను కంగారుగా ఈవలకు వస్తున్నాడు.

'ఏమిటి' అంటూ యెదురువెళ్ళాను.

'బాండేజీ కదిలి నెత్తురు లీకవుతున్నది. డాక్టరుకు ఫోను చెయ్యాలి. కాని మీరెవరూ వాళ్లతాలూకు మనుష్యుల్ని లేపకండి. గొడవ చేస్తారు' అంటూ పరుగెత్తాడు.

నేను నెమ్మదిగా ప్రక్కవద్దకు చేరుకుని నల్లటాయిలా స్టూలు మీద చతికిలబడి ఆమె ముఖంలోకి చూస్తున్నాను. నా అంతరాంతరాల్లోంచి నీలి వెళ్లిపోతున్నదని లోచింది. తలప్రక్కమీద వాల్చి వెక్కి వెక్కి యేడ్చాను. నా తలమీద నీలి చేయి వేసింది.

కళ్లు తుడుచుకుంటూ ఆమెలోకి చూశాను.

'న-న్నె-వ-రు పె ళ్లి-చే-సు-కుం-టా-రు?' అంటోంది జాలిగా.

ఆడేస్తాను. నిష్కామకర్మగా అబద్ధం చెప్పేస్తాను. కొన్ని గంటల నిముషాల్లో వెళ్లిపోయే ప్రాణికి బ్రహ్మాండమైన తృప్తి కలిగిస్తుందంటే ఒక చిన్న అసత్యం ఆడ్డానికి నేనెందుకు జంకాలి?

అయ్యో! చనిపోతున్నదని తెలిసీకూడా అబద్ధం చెప్పనా? అని వెనక్కి లాగుతున్నది మనస్సు.

మానవత్వమనేది యే కోశాన్నైనా వుంటే చెప్పు—ఈ క్షణాలు జారవిడిస్తే మళ్ళీ నిన్ను యెప్పటికీ యేమీ అడగదు ఆ ప్రాణి. ఇప్పుడే ప్రపంచంలో ఆమెకు యేదన్నా సంతృప్తి గాని సుఖంగాని కలిగించే మాట యేదన్నా వుంటే, అది నీ నోటినుంచే రావాలి? వూ—త్వరపడు! ఇందులో నీకేమీ స్వార్థం లేదే?— అంటూ ఎవరో హెచ్చరించినట్లుగా అయింది.

నా నరనరాలు కూడదీసుకుని దీక్షగా ఆమెకేసి చూశాను. నేనున్న పరిస్థితిలో ఎవ్వరూ ఎప్పుడూ వుండివుండరు. ఒకప్పుడు మనసా యేవగించుకున్న మనిషికోసం, యిప్పుడు అబద్ధం చెప్పి— సంతృప్తితో నిండిన ఆ ప్రాణి హృదయాంతరాల్లోని యేకైక పీఠాన్ని అధిష్ఠించబోతున్నాను.

డాక్టరు గబగబా వచ్చాడు. నేను బయటకు నడిచాను.

కాని నామీద అనేక వేల హండ్రడ్వెయిట్ల బరువు వున్నట్లు తోచింది. నిద్రలేక నాముఖం నానా అసహ్యంగానూ వుండొచ్చు,

కుంపుదగ్గరకువెళ్లి శుభ్రంగా ముఖం తోముకొచ్చాను. ముసలమ్మ గారు మల్లయ్య లేచికూర్చుని నావంక చూశారు.

డాక్టరు హౌసు సర్జనుకు 'వాతం కమ్మకుండా చూడాలి.' అంటున్నాడు.

నే నేం చెప్పగలను? అయ్యో నీలి బ్రతికే ఆశలేదని తెలిసీ ఆమె ప్రశ్నకు జవాబు చెప్పకుండా ఆలస్యం చేశాను ఈమారు నా సర్వశక్తులనూ కేంద్రీకరించుకోవటానికి ప్రయత్నం చేశాను.

ముగ్గురం వెళ్లి నీలి ప్రక్క నిలబడ్డాము.

హౌసు సర్జను పల్సు వ్రాసుకుంటున్నాడు. టెంపరేచర్ నోట్ చేసుకుంటున్నాడు. కత్తికోతలకు పోగా మిగిలిన దేహాన్ని సూదులతో తూట్లు పోగొడ్తున్నాడు. నీలికి తెలివి వస్తున్నది. కాని మాట రావటం చాలా కష్టంగావుంది. కళ్లు తెరిచేవోపిక కూడా వున్నట్లులేదు.

మల్లయ్యభార్య వెర్రిపిల్లాడ్ని వెంటబెట్టుకొని వచ్చింది. నాకు మాత్రం వాడిముఖాన్ని నీలికి చూపించటం యెంతమాత్రం యిష్టంలేదు. కాని అప్పుడు నేనేమన్నా బాగుండదు. వూరుకున్నాను. వాడు మంచందగ్గరసావెళ్లి మీదకు వ్రాలుతున్నాడు. చేత్తోకదుపుతాడేమో, ఎక్కడ బాధపడ్తుందోనని నేను వాడ్ని కొంచెం వెనక్కులాగాను. ముఖంమీద ముఖంపెట్టి పరీక్ష చేస్తున్నాడు. తప్పు అని నేను ముక్కుమీద వ్రేలుబెట్టుకు చూపాను.

ఆలస్యంగా ఆహారానికి బయల్దేరిన పిట్టలుమాత్రం బహుబద్ధకంగా ఆకాశంలో రెక్కలు కొట్టుకొంటూ ముందుకు పోతున్నాయి!

ఉదయం యెనిమిది గంటలప్పుడు కాబోలు నెమ్మదిగా యేడుస్తున్నది. ముఖం మరీ పల్చగావుంది. చెవులకు ఎర్రటి డాళ్లు బాగా మెరుస్తున్నై. చిన్న ఎర్రగన్నేరుపువ్వు యెక్కడన్నా దొరికితే బాగుండును......

రాత్రి కొంతసేపు నిద్రపట్టి వుండాలి. లేకపోతే రాత్రల్లా యేడవనిది యిప్పుడే లేచి గోలపెడ్తున్నదేః?

'నిద్రపోయావా?' అన్నా.

మత్తులోవున్నట్లు కళ్లువిప్పి 'పో—తా—ను. ని...ద్ర... పో...వా...ల...ని...వు...ం...ది...' అంది.

వెర్రిపిల్లాడు చొరుచుకొచ్చి వంగివంగి పరీక్షగా చూస్తున్నాడు. నీలి చేతిని నెమ్మదిగా వూయించింది. వాడుదగ్గిరగా వచ్చి వంగున్నాడు. అగ్గద్ద ముక్కను చేత్తోపుచ్చుకుని లాగింది. నేను నవ్వాను. నావైపు కొరకొరాచూస్తూ ఛంగుమని దూకేశాడు అక్కడ్నుంచి.

నీలి అంటోంది జాలిగా 'నేను బ్రతుకుతానా...' అని.

'అయ్యో! నువ్వు బ్రతక్కపోతే యెట్లా...నాకోసమన్నా బ్రతుకుతావు.'

'అంటే......'

'నేనే నిన్ను పెళ్లాడుదామనుకుంటున్నాను.'

'మీరా......'

ఆశ్చర్యంతో నీలి నాముఖంలోకి చూసింది. నేను నవ్వాను. చేత్తో ఆమె చేతిని తీసుకుని 'నేనే పెళ్లాడుతాను నీలీ నిన్ను. లేకపోతే యింతశ్రమా యెందుకు తీసుకుంటాననీ? మరి యిప్పుడు చెప్పు. నాకోసమన్నా బ్రతుకుతావుగదూ?'

నీలి హృదయపూర్వకంగా నవ్వింది.

ఆ శరీరంలో అక్కడా అక్కడా ప్రాణిని నిలబెట్టడానికి యింకా మిగిలివున్న రక్తము ఆమె చెంపల్లోకి చేరుకుంటోంది. నేను ప్రేమతో నారెండు చేతుల్నీ ఆమె చెంపలకు రాస్తూ—

'రాత్రల్లా నన్నెవరు పెళ్లాడుతారు? అంటూ పలవరించావు తెలుసునా—'

'అల్లాగా...నాకేదీ సరిగ్గా జ్ఞాపక ముండటం లేదు.'

'అప్పుడు చెబితే...ఆ సంతోషానికి తట్టుకోలేవేమోనని—'

చాలు! ఆమె ముఖంనిండుగా వొక్కమారు వెలిగింది.

నేను నాటకంలో నాపాత్రను చాకచక్యంతో నిర్వహించాననుకుంటాను. తరువాత నీలి యేమైందో నాకు తెలియదు. తెలుసుకోవాలనీ లేదు. ఆరోజుమాత్రం ఆదరాబాదరాలో ఆసుపత్రినుంచి యెవ్వరూ చూడకుండా పారిపోబోతూంటే, గేటుదగ్గర పెద్దగ్రుడ్లు చేసుకుని నిలబడ్డ వెర్రిపిల్లాడు, నన్ను పసిబట్టి వెంబడిస్తాడన్న భయంతో మరోమార్గంగుండా వీధిలోకొచ్చి పడ్డాను.

ఉదయం వొకవైపునుంచి జోరుగా యెండకాస్తూంటే వెనుకనుంచి నల్లటిమేఘం సూర్యరశ్మిని తరుముకొస్తోంది. తడబడుతూన్న కాళ్లతో నేను నడుస్తూంటే 'బాబా కుంటివాణ్ణండయ్యా! గ్రుడ్డివాణండయ్యా! కలిమిగల మారాజులు. ఒక్కకానీ ధర్మం చెయ్యండిబాబూ!' అన్న కేకలు నాకర్ణపుటాల్ని భేదించుకొని నన్ను వెనకనుంచి మరీమరీ ముందుకు తరిమాయి.